నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
1
శనివారం | 15 ఫిబ్రవరి 2025 | www.navatelangana.com

గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన జడ్జి స్వాతి రెడ్డి



నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణంలో మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలను డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, జడ్జి స్వాతి రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర న్యాయసే వాధికారసంస్థ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్ పర్సన్ కే. సాయి రమాదేవి అదేశాల మేరకు పాఠశాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. హాస్టల్‌లో భోజన నాణ్యత, వంటగది పరిసారాలు, నిల్వ ఉన్న ఆహార పదార్దాలని, బాత్ రూమ్స్, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉన్నాయా లేవా అని పరిశీలించడం జరిగిందన్నారు. లీగల్ అవేర్నెస్ ప్రోగ్రాంలో భాగంగా డ్రగ్స్ తీసుకోవడం తప్పు అని, వాటికీ పిల్లలు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. పిల్లలకు పోక్స్, బాలల చట్టాల గురించి వివరించారు. పిల్లలు మంచిగా చదువుకొని తమ లక్ష్యాని సాధించాలన్నారు. యోగ లో పాల్గొని గెలిచినా విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాగలక్ష్మి, న్యాయసేవధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎం గోదాంను సందర్శించిన కలెక్టర్



నవతెలంగాణ-సిద్దిపేటకలెక్టరేట్


జిల్లా కలెక్టరేట్ నెలవారి పరిశీలనలో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి కలెక్టరేట్ పక్కనగల ఎలక్షన్ ఈవీఎం గోదాంను సందర్శించి రిజిస్టర్‌ను పరిశీలిం చారు. ఎన్నికల సంఘం రూల్స్ ప్రకారం సెక్యూరిటీ నిర్వహిం చాలని సెక్యూరిటీ సిబ్బందిని ఆదేశిం చారు. కలెక్టర్ వెంట కలెక్టరేట్ ఏవో బ్దుల్ రెహమాన్ ఉన్నారు.

సీఆర్‌పీల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

సిఆర్పిల మీద పని ఒత్తిడి తగ్గించాలి

సిఆర్పి జిల్లా కమిటీ అధ్యకులు గట్టయ్య







నవతెలంగాణ-తూప్రాన్

రాష్ట్ర ప్రభుత్వం పెడుతున్న పని ఒత్తిడి కారణంగానే చేగుంట మండలానికి చెందిన ఇద్దరు సిఆర్పిలు మృతి చెందారని, వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సిఆర్పి జిల్లా కమిటీ అధ్యక, కార్యదర్శులు గట్టయ్య, రాజులు డిమాండ్ చేశారు. రోడ్డు పప్రమాదంలో మృతి చెందిన సీఆర్‌పీలు రమేష్ నాయక్(40), ఎర్రోళ్ల శ్రీనివాస్ (40)ల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న సిఆర్పి జిల్లా కమిటీ అధ్యక, కార్యదర్శులు గట్టయ్య, రాజులతో పాటు జిల్లాలోని సీఆర్పీలు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు సమ్మె చేసిన కాలం నుంచి ప్రతి పనులలో మండల, జిల్లా, రాష్ట్ర అధికారులు సీఆర్పీలను తీవ్రస్థాయిలో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఒకే రోజు 10 నుంచి 12 పనుల వరకు పని బాధ్యతలు అప్పగిస్తూ టార్గెట్ రూపొందిస్తూ మానసికంగా, భౌతికంగా క్షోభకు గురి చేస్తున్నారన్నారు. విద్యాశాఖలో క్రియాశీల పాత్ర పోషించే కాంట్రాక్టు ఉద్యోగులపైన అధికారుల ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. రోజువారి టార్గెట్లు పెట్టడం కాంట్రాక్టు ఉద్యోగులను మానసికంగా హింసించడమేనని,ఈ విధానం పూర్తిగా నశించాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన సిఆర్పిల కుటుంబాలకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు. ఈ సమావేశంలో జిల్లాలోని పలువురు సిఆర్పీలు, పిటిఐ , ప్రభుత్వ ఉద్యోగులు, పాల్గొన్నారు.

ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడిగా మహేష్



నవతెలంగాణ-జోగిపేట

ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం అందోల్ మండల అధ్యక్షుడిగా కుసంగి మహేష్ , జోగిపేట్ పట్టణాధ్యక్షుడిగా బేగరి అనిల్ కుమార్‌లను నియమి ంచినట్టు సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పంబల్ల దుర్గాప్రసాద్ తెలిపారు. వారికి జోగిపేటలో శుక్రవారం నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు అల్మాయిపేట్ మొగులయ్య, రాజు, భుజంగం, అశోక్, నవీన్, మాణిక్యం, శివ, బాబు తదితరులు పాల్గొన్నారు.

జోగిపేటలో కొవ్వొత్తుల ర్యాలీ



నవతెలంగాణ-జోగిపేట

పుల్వామా దాడి దాడిలో అమరులైన జవానులకు నివాళిగా శుక్రవారం జోగుపేట పట్టణంలో కొవ్వతుల ర్యాలీ నిర్వహిం చారు. స్థానిక బసవేశ్వర విగ్రహం నుంచి ప్రారంభమైన ర్యాలీ అంబేద్కర్ మీదుగా హనుమాన్ చౌరస్తా వరకు కొనసాగింది. ర్యాలీలో మృతి చెందిన జవానులకు జోహార్ జోహార్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ డిబీ. నాగభూ షణం, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు సార శ్రీధర్, నాయకులు చాపల వెంకటేశం, బీర్ల శంకర్, మహేష్ యాదవ్, ఉస నాగరాజు, మొగులయ్య, పత్తి వీరేశం, ప్రభు, సత్యం, అనిల్ కుమార్, కరుణాకర్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

కనబడని.. MLA

కనబడుటలేదు



పేరు: గూడెం మహిపాల్ రెడ్డి

హోదా: పటాన్ చెరు ఎమ్మెల్యే

- డంపింగ్ యార్డ్ సమస్య పట్టదా..?
- ఓట్లేసిన పాపానికి జనాలకు శాపమా
- పార్యానగర్ డంపిగ్ యార్డ్ గురించి పట్టించుకోని వైనం
- ప్రజా ఉద్యమానికి దూరంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- ఎమ్మెల్యే కనబట్లేదని సోషల్ మీడియాలో ట్రోలింగ్
- పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేయాలనే చర్చ

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

పదుల సంఖ్యలో గ్రామాలను పెంట దిబ్బ చేసే ప్రమాదకరమైన డంపింగ్ యార్డ్ తెచ్చి పెడుతుండ్రు. పంట పొలాలు, పాడి పశువులు, జీవరాసులు, ప్రకృతి సర్వం నాసనం కానున్నాయి. తల్లిలాంటి ఉన్న ఊరు...బతుకునిచ్చే పంట పొలాలు వల్లకాడు అవుతాయేమో అన్న భయాందోళన. ఉప్పెన లాంటి సమస్య తలెత్తి వేలాది జనం రోడ్డెక్కారు. పది రోజులపైగా ప్రజా ఉద్యమాన్ని నడుపుతున్నారు. అన్ని పార్టీల నేతలూ ప్రజా ఉద్యమానికి అండగా నిలుస్తున్నారు. ప్రజలు సైతం జెండాలు, ఎజెండాల్ని పక్కన పెట్టి డంపింగ్ యార్డ్ రద్దు అనే నినాదంతో కలిసి పోరాడుతున్నారు. కానీ..! ఒకే ఒక్కరు ఆ ఉద్యమంలో కనబడట్లేదు. ఆయనకు గుమ్మడిదల ప్రాంత ప్రజలు ఓట్లేయడంతోనే మూడు సార్లు ఎమ్మెల్యే అయ్యారు. ఓట్లేయడమే జనం పాపమైందా..? మాట వరసకైనా వచ్చి మద్దతు తెల్పకపోవడం ఏమిటీ..? ఇదీ ఇప్పుడు ప్యారానగర్ డంపింగ్ వ్యతిరేక ఉద్యమంలో చర్చనీయాంశమైంది. మా ఎమ్మెల్యే కనబడట్లేదంటూ సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేసే పరిస్థితి ఏర్పడింది.

మద్దతివ్వట్లేదు ఎందుకు..?

గుమ్మడిదల మండలంలోని 17 గ్రామాలకు పైగా ఎఫెక్ట్ చూపే డంపింగ్‌యార్డ్‌ను రద్దు చేయాలని కోరుతూ ఆ ప్రాంత ప్రజలంతా జేఏసీగా ఏర్పడి పోరాడుతున్నారు. తొలుత కొందరితోనే ఆందోళనలు మొదలైనా ఆ తర్వాత అన్ని రాజకీయ పార్టీలూ మద్దతివ్వడంతో ఉద్యమానికి బలం చేకూరింది. సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతివ్వడమే కాకుండా ప్రత్యక్ష కార్యక్రమాల్లో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొంటున్నారు. బీఆర్ఎస్ మాజీ మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ సైతం దీక్షల్లో పాల్గొన్నారు. బీజేపీ ఎంపీ, జిల్లా నాయకత్వం సైతం జేఏసీ పోరాటంలో కలిసొస్తుంది. కాంగ్రెస్‌లోని స్థానిక నాయకత్వం సైతం జేఏసీలో భాగస్వామ్యమైంది. కానీ..! ఒకే ఒక్కరు స్థానిక పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మాత్రం ఇంత వరకు డంపింగ్‌యార్డ్‌ను వ్యతిరేకిస్తూ ప్రకటన చేయలేదు. జేఏసీ ఉద్యమానికి మద్దతు కూడా ప్రకటించలేదని ఆ ప్రాంత ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యేగా ఉండి కూడా వేలాది మంది జనాలకు సమస్య కాబోతున్న డంపింగ్ యార్డ్ గురంచి ఎందుకు స్పందించట్లేదనేది చర్చగా మారింది.

కనబట్లేదని సోషల్ మీడియాలో వైరల్

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కనబట్లేదని ఆయన ఫోటోతో సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేస్తున్నారు. ముఖ్యంగా డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాటం నడుస్తున్న ప్రాంతంలో ఎమ్మెల్యే మద్దతు తెలిపి సంఘీబావంగా దీక్షల్లో పాల్గొనపోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వాట్సప్ గ్రూపుల్లో ఎమ్మెల్యే ఫోటో పెట్టి కనబట్లేదనే పేరిట ప్రచారం చేస్తున్నారు. మరి కొందరేమో ఎమ్మెల్యే కనబడట్లేదని స్థానిక పోలీస్ స్టేషన్, ఎస్పీ కార్యాలయంలోనూ పిర్యాదు చేయాలని కామెంట్ చేశారు. కొందరేమో ఎమ్మెల్యే ఆచూకి తెలిపితే బహుమతి అందజేయబడుతుందని కూడా గ్రూపులో మెసేజ్‌లు పెడుతున్నారు.

మూడు సార్లు గెలిపించిన ప్రజల కష్టాలు పట్టవా..?

పటాన్‌చెరు ఎమ్మెల్యేగా గూడెం మహిపాల్‌రెడ్డి మూడు సార్లు వరస విజయాలు సాధించారు. నియోజకవర్గంలో కీలక మండలంగా ఉన్న గుమ్మడిదలతో పాటు చుట్టూ ఉన్న గ్రామాల ప్రజలు ఆయనకు అండగా నిలిచారు. ఎన్నికల్లో ఓట్లేసి గెలిపించారు. ఆ మండల ప్రజలకు జీవన్మరణ సమస్య తలెత్తినప్పుడు కనీసం వారికి అండగా నిలకపోవడం పట్ల తీవ్ర వ్యతిరేకత కనిపిస్తుంది. మండలమంతా ఒక్కటై రోజుకో పద్ధతుల్లో ఆందోళనలు, నిరసనలు, ర్యాలీలు చేస్తున్న ప్రజలకు మద్దతుగా నిలకపోవడం పట్ల మండిపడుతున్నారు. రాజకీయాభిప్రాయాల్ని పక్కన పెట్టి జేఏసీగా ఏర్పడి పోరాడుతున్నారు. తమ పోరాటానికి ఒక రాజకీయ పార్టీ నాయకుడుగా కాకుండా ఒక ప్రజా ప్రతినిధిగానైనా సానుకూతలతను వ్యక్తం చేయట్లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దళిత యువకుడి చేతులు నరకడం దుర్మార్గం


నర్సిములు


మాణిక్


అశోక్

నవతెలంగాణ-సంగారెడ్డి

తమిళనాడులోని శివగంగా జిల్లాలో దళిత యువకుడు అయ్యస్వామి బుల్లెట్ బైక్‌ను కొనుగోలు చేసి నడుపుతుంటే.. జీర్ణించుకోలేని అగ్రవర్ణ ఆధిపత్య యువకులు పాశవికంగా ఆ యువకుడి రెండు చేతులను నరకడాన్ని కేవీపీఎస్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా కమిటీలు తీవ్రంగా ఖండించాయి. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు ఏ.మాణిక్, జిల్లా కార్యదర్శి పి.అశోక్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నర్సిములు మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు దాటినా దళితులను ఇంకా మనుషులుగా చూడడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం మతోన్మాదాన్ని తీవ్రంగా పెంచి పోషిస్తున్నదని.. మోడీ మూడోసారి ప్రధానమంత్రి అయిన తర్వాత దళితులపై దాడులు తీవ్రమయ్యాయన్నారు. మనుధర్మ శాస్త్రం సూచించిన వర్ణ వ్యవస్థను అమలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. దేశంలో దళితులపై తీవ్రమైన దాడులు జరుగుతున్నాయన్నారు. మతపరమైన దాడులపై స్పందించినంత వేగంగా కులోన్మాధ దాడులపై ఈ పాలకులు స్పందించడం లేదన్నారు. బుల్లెట్ బైక్ పై తిరిగే అర్హత ఈ దేశంలో దళితులకు లేదా అన్నారు. భారత రాజ్యాంగంలో పేర్కొన్న ప్రాథమిక హక్కులు దళితులకు వర్తించవా అన్నారు. దళిత యువకుని చేతులు నరికిన ఆధిపత్య వర్గాల యువకులకు కఠినమైన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు న్యాయవ్యవస్థ త్వరితగతిన శిక్షలు విధించకపోవడంతోనే దళితులపై ఆధిపత్య కులాలు మరింత పెట్రేగిపోతున్నా యన్నారు. సమసమానత్వాన్ని నెలకొల్పాల్సిన పాలకులు అసమానత్వ లను సృష్టిస్తున్నారని ఆధునిక ప్రజాస్వామ్య సమాజంలో ఈ వివక్షతలు మంచిది కాదన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



నవతెలంగాణ-మునిపల్లి

ఆరు గ్యారెంటీల అమలు చేయకుండా ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్నందున.. ఈ పభుత్వంపై పోరాటం చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. మండలంలోని ఖమ్మంపల్లి పీఎస్ఆర్ గార్డెన్‌లో బీఆర్ఎస్ క్యాలెండర్, డైరీని పార్టీ రాష్ట్ర నాయకులు జైపాల్ రెడ్డితో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో, ముఖ్య నాయకులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నదన్నారు. కాబట్టి ప్రజలను చైతన్య పరుస్తూ ప్రభుత్వంపై పోరాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలనాన్నరు. అదేవిధంగా రాబోయే రోజుల్లో కార్యకర్తలకు పార్టీ అందుబాటులో ఉంటుందని, ఎవరు అధైర్యపడొద్దని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జైపాల్ రెడ్డి, పైతర సాయి కుమార్, మాజీ జెడీ ప్టీసీ పైతర మీనాక్షి సాయికుమార్,మండల ప్రధాన కార్య దర్శి శశికుమార్, మండల ఉపాధ్యక్షులు గడ్డం భాస్కర్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం



నవతెలంగాణ-కల్హేర్

కేంద్ర బడ్జెట్లో తెలంగాణ రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని.. ఎనిమిది మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్ దుయ్యబట్టారు. శుక్రవారం మండలానికి వచ్చిన సందర్భంగా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..రూ.50 లక్షల 63 వేల కోట్లతో కేంద్ర బడ్జెట్ ఉన్నప్పటికీ.. ఏ ఒక్క విభజన హామీ అమలకు నోచుకోలేద న్నారు. రాష్ట్రం నుండి 8 మంది బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్న రాష్ట్రానికి నిధులు తీసుకురావడంలో పూర్తిగా విఫలమైయారన్నారు. రాష్ట్రానికి న్యాయం జరిగేలా బడ్జెట్లో సవరణలు చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే రాష్ట్ర బడ్జెట్లో నారాయణఖేడ్ అందోల్ జహీరాబాద్ సంగారెడ్డి ప్రజలకు ఉపయోగపడే బసవేశ్వర సంగమేశ్వర ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలన్నారు. రైతు రుణమాఫీ కానీ రెండు లక్షల రుణమాఫీ చేయాలన్నారు. రైతు భరోసా వెంటనే అర్హులైన రైతులందరికీ డబ్బులు వేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీల అమలు నత్తనక్క నడుస్తుందని వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయాలని అనాన్నరు. రైతుల భూ సమస్యలను భూమాత చట్టంతో వెంటనే పరిష్కారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, పెన్షన్లు అరులైన వారందరికీ ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో ప్రజల సమీకరించి పోరాడతామని ప్రభుత్వం హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) నాయకులు దత్తు, బాబురావు, శ్రీనివాస్, భూమయ్య మల్లేష్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలకు చదువు, రక్షణ ఎంతో ముఖ్యం

- బాల్యవివాహాలు నిర్మూలన ప్రతి ఒక్కరు బాధ్యత
- జిల్లా శిశు సంక్షేమ అధికారి లలిత కుమారి



నవతెలంగాణ-జోగిపేట

ఆడపిల్లలకు చదువుతోపాటు రక్షణ ఎంతో ముఖ్యమైనవని.. బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా శిశు సంక్షేమ అధికారి లలితా కుమారి అన్నారు. అందోల్ ఎంపీడీవో కార్యాలయంలో మహిళ, శిశు సంక్షేమశాఖ, జోగిపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బాల్య వివాహాలు నిషేధంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆడ పిల్లలను చదివించి, ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని వివరించారు. జిల్లాలో గతేడాది 46 బాల్య వివాహాలను నిలుపుదల చేశామన్నారు. ఈసారి బాల్య వివాహాలు జరగకుండా గ్రామ కమిటీలు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. 9,10, ఇంటర్ విద్యార్థులతో పాటు డ్రాప్ ఓటు విద్యార్థుల లిస్టులు సేకరిస్తున్నట్టు తెలిపారు. వారి పైన ఎప్పటికప్పుడు నిఘా ఉంటుందన్నారు. అమ్మాయిలపై అఘాయిత్యాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. జిల్లాలోని ఐదు ప్రాజెక్టులలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వాలు కూడా అమ్మాయిల కోసం అనేక విద్యాసంస్థలను అందుబాటులోకి తెచ్చిందని, అనేక సదుపాయాలు కల్పిస్తుందని వాటిని ఉపయోగించుకోవాల న్నారు. అమ్మాయిలు వాళ్ళ కాళ్ళ మీద వాళ్ళు నిలబడిన తర్వాతనే వివాహాలు ప్లాన్ చేసుకోవాలని సూచించారు. అనంతరం బాల్య వివాహాలు నిర్మూలన కోసం ప్రతిజ్ఞ చేశా రు. ఈ కార్యక్రమంలో జోగిపేట ఐసీడీఎస్ సీడీపీవో ప్రియాంక, తాలెల్మ మెడికల్ ఆఫీసర్ సత్యనారాయణ, జోగిపేట ఎస్సై పాండు. డిసిపియు అధికారి రత్నం, సఖి అడ్మిన్, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్, పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్, ఐసీడీఎస్ సూపర్వైజర్లు, హెల్త్ సూపర్వైజర్లు, డీసీపీయూ సిబ్బంది, వార్డ్ ఆఫీసర్లు, సెక్రెటరీస్, ఐకేపీ సిబ్బంది, ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయవంతంగా ముగిసిన అంతర్జాతీయ సదస్సు

- ఆలోచింపజేసిన దేశ, విదేశీ నిపుణుల ప్రసంగాలు
- భవిష్య సవాళ్లపై లోతైన అవగాహన



నవతెలంగాణ-పటాన్‌చెరు

గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ హైదరాబాదులో ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు 'ఫార్మాస్యూటికల్, ఆరోగ్య శాస్త్రాల్లో సమగ్ర ధోరణులు' అనే అంశంపై నిర్వహించిన మూడ్రోజుల అంతర్జాతీయ సదస్సు శుక్రవారం విజయవంతంగా ముగి యడమే గాక, ప్రపంచ ఔషధ, ఆరోగ్య సంరక్షణ రంగంలో చెరగని ముద్ర వేసింది. డాక్టర్ రెడ్డీస్ వ్యవస్థాపక డైరెక్టర్ డాక్టర్ ఆకెళ్ళ వెంకటేశ్వర్లు, కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ (సీడీఎస్ సీవో) డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎ.రామ్ కిషన్ తదితరులు ఈ సదస్సును ప్రారంభించారు. వారి స్ఫూర్తిదాయకమైన మాటలు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ నిపుణులు, పరిశోధకులను ఒకచోట చేర్చిన వేదికగా నిలిచాయి. మూడ్రోజుల పాటు జరిగిన ఈ సదస్సులో ఔషధ, ఆరోగ్య శాస్త్రాల అభివృద్ధి చెందుతున్న అంశంపై లోతైన అవగాహన అందించిన ప్రముఖ వక్తలకు ఆతిథ్యం ఇచ్చింది. తొలిరోజు డాక్టర్ రెడ్డీస్ సీనియర్ శాస్త్రవేత్త ప్రొఫె సర్ పరిమళ్ మిశ్రా, నైపర్ హైదరాబాద్ డీన్ ప్రొఫెసర్ శ్రీనివాస్ నండూరి, పంజాబ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు వినోద్ కుమార్, రాజ్ కుమార్, క్రొయేషియాలోని సెంటర్ ఫర్ ఇన్ఫర్మేటిక్స్ శాస్త్రవేత్త డాక్టర్ జురికా నోవాక్ ఆలోచింపజేసే ప్రసం గాలు చేశారు. రెండు రోజు కూడా ఇదే ఒరవడి కొనసాగింది. మలేషియాలోని ఐఎంయూ వర్సిటీకి చెందిన డాక్టర్ త్యాగరాజన్ మాధేశ్వరన్, బిట్స్ పిలా నీకి చెందిన ప్రొఫెసర్ అనిల్ కుమార్, అమెరికాలోని చాప్ మన్ వర్సిటీ ప్రొఫెసర్ కెపరాంగ్, శ్రీలంకలోని వాయంబా విశ్వవిద్యాలయం నుంచి ప్రొఫెసర్ ఎస్.జీవతయపరన్, కాలిఫోర్నియాలోని సైట్ఎక్స్ థెరప్యూటిక్స్ నుంచి డాక్టర్ రాఘవ శ్రీరమణేని నేతృత్వంలో ఆకర్షణీయమైన చర్చలు జరిగాయి. ఇక చివరి రోజున, ఈ సదస్సు ఐఈఎఫ్ఆర్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఉదయ్ సక్సేనా, ఎన్వేద థెరప్యూటిక్స్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీకాంత్ రామచంద్రన్, దక్షిణ కొరియా నుంచి ప్రొఫెసర్ గంగరాజు గెడ్డా, పూణే నుంచి ప్రొఫెసర్ చిన్మోయ్ పాత్రా వంటి ప్రఖ్యాత నిపుణు లు ఆరోగ్య సంరక్షణ, ఔషధ ఆవిష్కరణల భవిష్యత్తుపై అద్భుతమైన అంతర్దృష్టులను పంచుకున్నారు. ఈ సదస్సు నిర్వాహకుడు డాక్టర్ ప్రతీక్ పాఠక్ మాట్లాడుతూ.. ఇందులో 60కి పైగా మౌఖిక ప్రదర్శనలు, వందకు పైగా పోస్టర్ ప్రదర్శనలు, 15 మంది నిపుణుల ఉపన్యాసాలు జరిగినట్టు తెలిపారు. విద్యా శాస్త్రీయ అంశాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించామన్నారు. ప్రపంచ జ్ఞాన సమ్మేళనంగా నిలిచిన ఈ సదస్సులో అమెరికా, క్రోయేషి యా, మలేషియా, శ్రీలంక, దక్షిణ కొరియా, భారతదేశం నుంచి విభిన్న శ్రేణి వక్తలు పాల్గొన్నారని డాక్టర్ ప్రతీక్ తెలిపారు. మూడు వేర్వేరు దేశాలతో పాటు మనదేశంలోని ఆరు రాష్ట్రాల నుంచి 450 మంది హాజరైన ఈ సదస్సులో ఆరోగ్య సంరక్షణ, ఔషధ పురోగతిపై సార్వత్రిక ఔచిత్యాన్ని, పెరుగు తున్న ఆసక్తిని నొక్కి చెప్పిందన్నారు. ఈ అంతర్జాతీయ సహకారం గొప్ప చర్చలు, కొత్త ఆలోచనలు, పరిశ్రమ యొక్క భవిష్యత్తును రూపొందించే సవాళ్లు, అవకాశాల గురించి లోతైన అవగాహనను పెంపొందించినట్టు పేర్కొ న్నారు. అంతేగాక, జ్ఞానాన్ని పంచుకోవడానికి, ఆలోచనల మార్పిడికి, ఆరోగ్య సంరక్షణ భవిష్యత్తును రూపొందించే సహకారాలను పెంపొందించడానికి ఒక పరివర్తన వేదికగా తోడ్పడినట్టు ప్రతీక్ వివరించారు.ఈ సదస్సు విజయ వంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఓరల్, పోస్టర్ ప్రజెంటేషన్ విజేతలకు బహుతులు, వారిని ఎంపిక చేసిన ప్యానల్ కు జ్ఞాపికలను అందజేసి సత్కరించారు.

ముత్తంగిలో వీధి కుక్కల స్వైర విహారం

చిన్నారిని చుట్టుముట్టిన వీధి కుక్కలు

లాకెళ్లే ప్రయత్నం.. అడ్డుకున్న స్థానికులు





నవతెలంగాణ-పటాన్‌చెరు

ముత్తంగిలో వీధి కుక్కల స్వైర విహారం చేశాయి. ఓ బాలుడిని చుట్టుముట్టి విచక్షణా రహితంగా కరిచి లాకెళ్లే ప్రయత్నం చేయగా స్థానికులు అడ్డుకున్నారు. పటాన్చెరు మండలం, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముత్తంగి గ్రామంలో న్యూటౌన్ కాలనీలో కాలనీలో ఖమ్రుద్దీన్ అనే వ్యక్తి కుటుంబంతో నివసిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం సమయంలో అతడి కుమారుడు ఉస్మాన్ కాలనీలోని ఇంటి ముందు ఆడుకుంటున్న సమయంలో ఐదు వీధి కుక్కలు అతడిపై ఒక్కసారిగా దాడి చేసి తీవ్రంగా కరించాయి. రక్తసిక్తమైన చిన్నారిని వీధి కుక్కలు లాక్కెళ్లే ప్రయత్నం చేశాయి. పిల్లవాడి అరుపులు విన్న స్థానికులు పరుగున వచ్చి కుక్కలను అక్కడినుంచి తరిమారు. ఉస్మాన్‌కు వీపుపై, చేతిపై, నడుముపై కుక్కలు కరిచి తీవ్రంగా గాయపరిచాయి. కుటుంబ సభ్యులు హుటాహుటిన బాలుడిని ప్రయివేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. న్యూటౌన్ కాలనీలో అంగన్వాడీ కేంద్రం ముందు, పల్లె ప్రకృతివనంలో, నీటి ట్యాంక్ వద్ద పెద్దఎత్తున కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతూ తరచుగా అంగన్వాడీ పిల్లలపైన దాడి చేస్తున్నాయని కాలనీవాసులు చెప్పారు. తాము చిన్నారిని కాపాడని పక్షంలో లాక్కెళ్లేవనిఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో విచ్చలవిడిగా వీధి కుక్కలు తిరుగుతూ కరు స్తున్నప్పటికీ కుక్కలను నియంత్రించడంలో అధికారులు విఫలం చెందుతున్నారని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

డీవైఎఫ్ఐ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లా పర్యావరణ కార్యాలయంలో డీవైఎఫ్ఐ క్యాలెండర్‌ను పొల్యూషన్ బోర్డ్ అధికారి గీతా సఫారీ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని, ప్రతీ ఒక్కరు కూడా మొక్కలను నాటాల న్నారు. రేపటితరాన్ని కాపాడుకునే బాధ్యత అందరిపైన ఉందన్నారు. డీవైఎఫ్ఐ పర్యావరణాన్ని పరిరక్షించడం కోసం మొక్కలు నాటే కార్యక్రమం.. అదేవిధంగా పరిశ్రమల నుంచి వస్తున్న కాలుష్యాన్ని అరికట్టే కార్యక్రమాల కోసం ప్రజలను చైతన్యవంతం చేయడం అభినందనీ యమ న్నారు.కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్, పర్యావరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధి మార్గాలు ఎంచుకోవాలి



నవతెలంగాణ-జోగిపేట

యువత స్వయం ఉపాధి మార్గాలు ఎంచుకొని, ఆర్థికంగా ఎదగాలని రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ మఠం బిక్షపతి అన్నారు. అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలో మొహిసిన్ బైక్ పాయింట్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత ఆర్థికంగా ఎదిగేందుకు ఎన్నో మార్గాలు ఉన్నాయని, క్రమశిక్షణ గల యువతకు భవిష్యత్తులో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. బైక్ పాయింట్ దినదినాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాగరత్నం గౌడ్, ఎండి పైజల్, ప్రొప్రైటర్ మోసిన్ తదితరులు పాల్గొన్నారు.



గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-కల్హేర్

మండలంలోని కృష్ణాపూర్ గ్రామానికి చెందిన సాయిలు నూతన గృహప్రవేశ వేడుక శుక్రవారం జరిగింది. ఈ వేడుకకు నారాయణఖేడ్ మాజీ సభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం సాయిలు కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పండరి, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు .



విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

నవతెలంగాణ-మనూర్

మండలంలోని శేలిగేరా ఎల్గొయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పరీక్ష సామాగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు. 32మంది విద్యార్థులకు ట్రస్ట్ చైర్మెన్ రవి నాయక్ సామగ్రిని అందజేశారు. ఆయన గతంలో పరీక్షా ఫీజు కూడా చెల్లించడం గమనార్హం. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికల కోసం పటిష్ట ఏర్పాట్లు

నవతెలంగాణ-న్యాల్‌కల్

27వ తేదీన జరగబోయే పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మండలంలో గల పోలింగ్ బూత్‌ను నోడల్ ఆఫీసర్ సోమేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. బూత్‌లో తాగునీరు, విద్యుత్, మూత్రశాలల సౌకర్యాలపై ఆరా తీశారు. కాగా ఈ ఎన్నికల కోసం పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్టు తహసీల్దార్ భూపాల్ చెప్పారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌రావు, స్థానిక పంచాయతీ సెక్రెటరీ ధనరాజ్, శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.



డీసీసీబీ బ్యాంకు సేవలపై అవగాహన

నవతెలంగాణ-ఝరాసంగం

డీసీసీబీ బ్యాంకు వినియోగదారులకు అందిస్తున్న మెరుగైన సేవలపై ఝరాసంగం బ్యాంకు మేనేజర్ రాజు మహిళా సమైక్య భవనంలో సీసీలు, వీవోఏలకు శుక్రవారం అవగాహన కల్పించారు. తాము ఇప్పటికే గోల్డ్ లోను, ఆర్డి పథకం, లాకర్ సదుపాయాలను మహిళా సంఘాల సభ్యులు వినియోగించుకునేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం తిక్యా నాయక్, ఫీల్డ్ ఆఫీసర్ పుణ్య లక్ష్మి, సీసీలు వివోఏలు తదితరులు పాల్గొన్నారు.



పుల్వామా వీర జవాన్లకు నివాళి

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపాల్టీ మల్లన్న బస్తిలోని బొల్లారం పబ్లిక్ స్కూల్ లో పుల్వామా దాడిలో అమరులైన వీర జవాన్ల చిత్రపటాలకు పాఠశాల యాజమాన్యంతో కలిసి మున్సిపల్ యువజన నాయకుడు వి.ప్రవీణ్ రెడ్డి శుక్రవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా యువజన నాయకుడు ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ.. పాక్ ముష్కరుల దాడిలో 40 మంది జవాన్లను పొట్టన పెట్టుకున్నారని గుర్తుచేశారు. దాడి జరిగి ఆరేండ్లు గడిచిందన్నారు. అమరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు రాజు, సాయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికులు పాల్గొన్నారు.



నేటినుంచే మాచ్నూర్ రామలింగేశ్వర స్వామి జాతర

నవతెలంగాణ-ఝరాసంగం

మండల పరిధిలోని మాచ్నూర్ గ్రామ శివారులో వెలసిన రామలింగేశ్వర స్వామి జాతర ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో బోరు బావిని తవ్వించి, ఆలయ పరిసర ప్రాంతంలో చలువ పందిళ్లను ఏర్పాటు చేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. మూడ్రోజులపాటు కొనసాగే ఉత్సవాలకు కర్ణాటక రాష్ట్రంతో పాటు జిల్లా నలుమూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొననున్నారు.ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా బర్దిపూర్ ఆశ్రమ పీఠాధిపతి అవధూతగిరి మహారాజ్ హాజరుకానున్నారు.



ఫిబ్రవరి దాటకముందే వేసవి సెగలు

- ముందే మండుతున్న ఎండలు
- మార్చి, ఏప్రిల్‌లో మంట పుట్టించే ఎండల తీవ్రత
- 2024 అత్యంత వేడి సంవత్సరంగా నమోదు
- ఈసారి ముందుగానే భానుడి భగభగలు
- ముందు జాగ్రత్తలు తప్పనిసరి : వైద్యులు



ఇప్పుడే దుకాణాలకు చేరుకున్న కూలర్లు..

> ఎన్నడూ లేనివిధంగా ఈసారి ఫిబ్రవరి మొదటి వారంలోనే ఎండలు మండుతున్నాయి. ఫిబ్రవరి నెలలోనే వేసవిని తలపించేలా ఎండలు మండి పోతున్నాయి. సాధారణంగా మార్చి మొదటి వారం నుంచి ఎండలు పెరుగుతాయి. శివరాత్రికి సమయానికి చలి పోయి.. ఎండలు ప్రారంభం అవుతాయి.కానీ ఈసారి ఫిబ్రవరి మొదటివారం నుంచే భానుడు ఉగ్రరూపం దాలుస్తున్నాడు. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో జనం ఉక్కపోతను భరించలేకపోతున్నారు. కనిష్ట ఉష్ణోగ్రతల్లోనూ పెరుగుదల కనిపిస్తోంది.

నవతెలంగాణ-ఝరాసంగం

2024 జనవరి నెలలో 32.4 డిగ్రీల సెన్సెస్‌గా నమోదయ్యింది. గత వారం రోజుల క్రితం 15 నుంచి 20 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదు కాగా.. ప్రస్తుతం మండలంలో 30 నుంచి 34 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వచ్చే సోమవారం నాటికి 35 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత దాటనున్నట్టు అధికారులు వెల్లడిస్తున్నారు.

2024 రికార్డులు దాటనున్నాయా?

గత 100 ఏండ్ల కాలంలో 2024 సంవత్సరాన్ని అత్యంత (ఉష్ణోగ్రత) వేడి సంవత్సరంగా అధికారులు నమోదు చేశారు. 2025 సంవత్సరం కూడా అదే తరహాలో ఉంటుందని అధికారులు పేర్కొం టున్నారు. అంతేకాకుండా రాబోయే రోజుల్లో గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణ కంటే ఎక్కువగా నమోదవుతాయని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. వారం రోజులుగా మండలంలో ఉక్కపోత ప్రారంభమైంది. వచ్చే మార్చి నెలలో 37 డిగ్రీల నుంచి 38 డిగ్రీల సెల్సియస్, ఏప్రిల్ నెలలో 40 నుంచి 42 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలున్నట్టు అధికారులు అంచనా వేశారు.

ముందు జాగ్రత్తలు తప్పనిసరి..

ప్రస్తుతం పగలు ఎండ రాత్రి చలిగాలులు వీస్తుండడంతో బయటి ఆహారపు అలవాట్లకు దూరంగా ఉండటమే ఉత్తమమని వైద్యులు సూచిస్తున్నారు. పెరుగుతున్న ఎండలకు అనుగుణంగా మన ఆహారపు అలవాట్లను మార్చుకోవాలి. శరీరంలో నీటి శాతం పెంచే తాజా పండ్లను తీసుకోవడం మంచిది. చిన్నపిల్లలు, వృద్ధులు తప్పని సరిగా జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు. రాగిజావ మజ్జిగ కొబ్బరి నీళ్ల తాగిస్తే ఆరోగ్యానికి మంచిదన్నారు. ఎండల తీవ్రతకు తగ్గట్టుగా మనం తీసుకునే ఆహారంలో మాంసాహారానికి బదులుగా శాఖాహారానికి ప్రాధాన్యం ఇవ్వాలని వైద్యులు పేర్కొంటున్నారు. నెల రోజుల ముందే సూర్యుడు తన ప్రతాపం చూపిస్తుండడంతో ముందు ముందు పరిస్థితులు ఇంకా ఎలా ఉంటాయోనన్న ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతోంది.

స్కూల్, స్పోర్ట్స్ గ్రాంట్‌లను పాఠశాల అవసరాలకు ఖర్చు చేయాలి

- జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి
- సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం
- పోతిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు



నవతెలంగాణ-సంగారెడ్డి

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలకు ప్రభుత్వం కేటాయించిన స్కూల్ గ్రాంట్, స్పోర్ట్స్ గ్రాంట్, ఇతర నిధులను పాఠశాలల అవసరాలకి ఖర్చు చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు విద్యాశాఖ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి, సంరక్ష కోఆర్డినేటర్లు, డీసీఈబీ కార్యదర్శితో విద్యాశాఖ కార్యక్రమాలు పదో తరగతి వార్షిక పరీక్షలు.. పాఠశాలకు విడుదలైన నిధులు గురించి ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారుల ఉద్దేశించి మాట్లాడారు. పాఠశాలలకు విడుదలైన నిధులను ప్రధానోపాధ్యా యులు పాఠశాలల అవసరాలకు ఖర్చు చేయాలని స్కూల్ గ్రాంటు, స్పోర్ట్స్ గ్రాంటు ఇతర నిధులను వెంటనే ఖర్చుచేసి కొనుగోలు చేసిన సామాగ్రి పాఠశాలల్లో అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన ప్రతీ రూపాయికి సంబంధించి లెక్కలను రికార్డులను మెయింటైన్ చేయాలని అధికారులకు సూచించారు. సమీక్ష ముగిసిన అనంతరం కలెక్టర్ పోతిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతులను పరిశీలించి వారి ప్రతిభా సామర్ధ్యాలను పరిశీలిం చారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. 10వ తరగతి జీవి తంలో కీలకమైనదని పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. పరీక్షల సమయం దగ్గర పడుతున్నందున ప్రతి రోజు అన్ని సబ్జెక్టులు చదువుకునేలా వ్యక్తిగతంగా టైం టేబుల్ రూపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో మాట్లాడి పాఠశాలకు వచ్చిన నిధులు ఖర్చు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల నిధుల ఖర్చు వివరాలు నివేదిక రూపంలో సమర్పించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు వెంటనే ఆయా పాఠశాలలకు మంజూరైన నిధులను వెంటనే ఖర్చు చేయాలని సూచించారు. పదో తరగతి విద్యా ర్థులకు ప్రత్యేక తరగతుల్లో టైం టేబుల్ ప్రకారం స్నాక్స్ అందించాలని తగిన ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని మా ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతిని ఘనంగా నిర్వహించారు. సంగ్రామ్ మహారాజ్ ఆశ్రమ పీఠాధిపతి ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరగ్గా.. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొన్నారు. అనంతరం సేవాలాల్ మహారాజ్ చిత్రపటాలకు ప్రత్యేక పూజలు చేసి స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు, అనంతరం వారు మాట్లాడుతూ.. ముందుగా అందరికీ సేవాలాల్ మహారాజ్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. పెద్ద ఎత్తున సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు నిర్వహించినందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. నారాయణఖేడ్‌లో బంజారా భవన్‌ను త్వరలోనే ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే అన్నారు. తరువాత పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి డీజేతో ఊరేగింపు, డప్పులతో దరువు వేసుకుంటూ డాన్సులు చేయడం జరిగింది. బంజారా పాటల మీద అందరూ డాన్స్, పీర్ల పండగ మజన ఆడారు. ఈ కార్యక్రమంలో సంగ్రామ్ మహారాజ్ కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి, దేవిదాస్ మహారాజు కారుబారి పూజారులు, రమేష్ చౌహన్, రవి చౌహన్, నెహ్రూ నాయక్, ఉద్యోగ సంఘాల నేతలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, మహిళలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

జిల్లా రెవెన్యూ అధికారిణి పద్మజ రాణి



నవతెలంగాణ-సంగారెడ్డి

యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారిణి పద్మజ రాణి అన్నారు. ఐసీసీలోని సమావేశ మందిరంలో మాదక ద్రవ్యాల నిర్మూలన నార్కోటెక్ కమిటీ సమన్వయ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు బానిసం కాకుండా దూరంగా ఉండాలన్నారు. ఆ దిశగా అనుబంధ శాఖల అధికారులు అవగాహన కల్పించాలన్నారు. గంజాయి సాగు చేస్తే శిక్షకు గురవుతారని రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. డ్రగ్స్ అమ్మే వారి గురించి పౌరులు తమ బాధ్యతగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. బస్సులు, వాహనాలను తనిఖీ చేయాలని, సరిహద్దు ప్రాంతాల్లో గట్టి నిఘా వేయాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలపై జిల్లాలో పాఠశాలు, కళాశాలల్లో, గ్రామాల్లో వివిధ రకాల ప్రభుత్వ శాఖల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులు జీవితంలో స్థిరపడాల్సిన సమయంలో దురలవాట్లకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని, రాబోయే భవిష్యత్తును బంగారు బాటలు వేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎక్సైజ్ అధికారి నవీన్ చంద్, సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య గౌడ్, వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖ, ఇంటర్మీడియట్ విద్యాశాఖ, వైద్య శాఖ, ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపల్స్, ప్రైవేటు కళాశాల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-పటాన్‌పల్లి

మండలంలోని పోతులబోగూడ గ్రామంలో మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ తన నివాసంలో బీఆర్ఎస్ క్యాలెండర్, డైరీని పార్టీ కార్యకర్తలతో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ పథకాలను 100 రోజుల్లో అమలు చేసి తీరుతామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి.. అధికారంలోకి వచ్చి 12 నెలలు దాటినా అమలు చేయడం లేదని దుయ్యబట్టారు. సీఎం గంటకో మాట చెబుతూ కాలయాపన చేస్తున్నాడని ఆరోపించారు. రెండు నుంచి మూడు ఎకరాలకు రైతు భరోసాను ఖాతాలో జమ చేసినట్టు రెండ్రోజులుగా పుకార్లు పుట్టిస్తున్నా రని.. కానీ అది జరగలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రహదారుల గురించి ప్రస్తావించిన నాయకులు.. నేటికీ ఏడాది దాటిన రోడ్లపై దృష్టి ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయ కులు అధికారం అడ్డుపెట్టుకొని బీఆర్ఎస్ కార్యకర్తల మీద రెచ్చిపోతుండడం మానుకోవాలన్నారు. తాము పార్టీలకతీతంగా పనులను చేశామే తప్పా.. గ్రామాల అభివృద్ధిలో రాజకీయం చేయలేదన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వంపై గ్రామాల్లో తీవ్ర స్థాయిలో రైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. ప్రభుత్వం పూర్తికాలం పనిచేస్తుందా లేదా అనేది నిస్సందేహంగా ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి శివాజీ రావు, ఏఎంసీ మాజీ చైర్మెన్ అశోక్ గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బుద్ధిరెడ్డి వీరా రెడ్డి, ఆయా గ్రామాల పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మృతదేహం లభ్యం

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

మాదారం గ్రామంలోని దువ్వ కుంట పెద్దవాగులో శుక్రవారం ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైనట్టు బొల్లారం సీఐ రవిందర్‌రెడ్డి తెలిపారు. మృతుడి జేబులో దొరికిన డ్రైవింగ్ లైసెన్స్ ప్రకారం అతడు మహారాష్ట్రకు చెందిన గౌతమ్ గైక్వాడ్(38)గా గుర్తించారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు ఐడీఏ బొల్లారం ఎస్‌హెచ్‌ఓ 8712656729, 8712661841ను సంప్రదించాలని సీఐ తెలిపారు.

భూ కబ్జాకు పాల్పడుతున్న సింగూర్ జెన్కో ఉద్యోగి !

- ఆధారాల కోసం దళిత విలేకరి ఫోటోలు తీయగా..
- లాక్కొని ఫోటో డిలీట్ చేసిన అతని అనుచరులు
- బైక్ తాళం లాక్కొని దాడికి ప్రయత్నం
- స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విలేకరి



నవతెలంగాణ-పుల్కల్

సింగూర్ బస్టాండ్ సమీపంలో ఇరిగేషన్ స్థలానికి సంబంధించిన సుమారు రెండు ఎకరాల భూమిని ఓ జెన్కో ఉద్యోగి ఆక్రమించుకొని షెడ్లు వేసి వ్యాపారాన్ని నిర్వహిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయాన్ని పూర్తి ఆధారాలతో ఫోటోలు తీసి ప్రచురితం చేసే ప్రయత్నం చేయగా అక్కడున్న జెన్కో ఉద్యోగి అనుచరులు.. ఆ దళిత జర్నలిస్ట్ ఫోన్ లాక్కొని ఫోటోలు, వీడియోలు డిలీట్ చేయడమే కాకుండా బైక్ తాళం బలవంతంగా తీసుకొని దాడి చేసే ప్రయత్నం చేశారు. అక్కడున్న కొందరు స్థానికులు గమని ంచి సర్ది చెప్పి జర్నలిస్టుకు సంబంధించిన బైక్ తాళం ఇప్పిం చారు. దాంతో ఆ జర్నలిస్ట్ నేరుగా పుల్కల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి.. మాదిగా జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల బాబు, జాతీయ నాయకులు లాలయ్య, రాష్ట్ర కో కన్వీ నర్ డప్పు రామస్వామి, నిజాంబాద్ జిల్లా ఇంచార్జ్ దేవరం పల్లి అశోక్, అందోల్ అసెంబ్లీ కన్వీనర్ అర్జునులతో కలిసి ఎస్సై క్రాంతి కుమార్ పాటిల్‌కు ఫిర్యాదు చేశారు. దాడికి ప్రయత్నించి దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా ఇప్పటికే పగలు ప్రభుత్వ ఉద్యోగం.. రాత్రి చీకటి దందా అనే శీర్షికతో ప్రత్యేక కథలను ప్రచురితం చేయగా.. దానికి మైనింగ్ అధికారులు కూడా స్పందించి దాడులు చేయగా రెండు టిప్పర్లు పట్టుబడ్డాయి. ఈ విషయాన్ని మనస్సులో పెట్టుకునే.. దాడికి ప్రయత్నం చేసినట్టు బాధిత విలేకరి తెలిపారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



నవతెలంగాణ-కొండాపూర్

మండలంలోని గంగారం గ్రామాల్లో కొనసాగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను ఏపీఓ వీరప్ప శుక్రవారం పరిశీలిం చారు. ఈ సందర్భంగా కూలీల హాజరు రిజిష్టర్‌ను తనిఖీ చేసి స్వయంగా హాజరు తీసుకున్నారు. ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేసవి ఎండల తీవ్రత పెరుగుతున్నందున పని ప్రదేశంలో కూలీలు సేద తీరేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, ఎండల బారిన పడకుండా ఉండేందుకు ఓఆర్ఎస్ పాకెట్లను అందుబాటులో ఉంచాలని ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. కొలతల ప్రకారం పని వివరాలను పక్కాగా రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. కూలి డబ్బులు సక్రమంగా బ్యాంకు ఖాతాలో పడుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే ఫీల్డ్ అసిస్టెంట్ దృష్టికి తీసుకురావాలని కూలీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్, రవి తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
మెదక్
శనివారం | 15 ఫిబ్రవరి 2025 | www.navatelangana.com

పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-మెదక్

పెండింగ్ పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. రామాయంపేట మున్సిపాలిటీ, పంచాయతీ రాజ్, ఆర్అండ్ బి అధికారులతో జిల్లా కలెక్టర్ శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా శాఖలకు సంబంధించిన వివిధ దశలలో ఉన్న పనులను, వాటి పురోగతిని సమీక్షించి సాధ్యమైనంత త్వరగా వాటిని పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్లు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫారం బద్దలు కొట్టి కాపర్ వైర్ చోరీ



నవతెలంగాణ-వెల్దుర్తి

విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ బద్దలు కొట్టి అందులో ఉన్న కాపర్ వైర్, ఆయిల్‌ను గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. మండల కేంద్రంలోని వైకుంఠధామం పక్కన నాలా చెరువు శ్రీనివాస్ గౌడ పొలం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు బద్దలు కొట్టారు. శుక్రవారం నాల చెరువు శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం రోజువారిలాగే పొలం వద్దకు వెళ్లి ఇంటికి రాత్రి వచ్చానన్నారు. శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా ట్రాన్స్ఫార్మర్ పూర్తిగా బద్దలై అందులో ఉన్న కాపర్ రాగి, ఆయిల్ దొంగలించినట్లు గుర్తించామన్నారు. ట్రాన్స్ఫార్మర్ విడిభాగాలు పొలంలో పడవేశారన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-హవేలీ ఘనపూర్

హవేలీ ఘనపూర్ మండలంలోని గాజి రెడ్డి పల్లి గ్రామానికి చెందిన కాయితీ రాములు మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మెదక్ బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి మృతుని కుటుంబానికి రూ. 5 వేల ఆర్థిక సహాయం శుక్రవారం పార్టీ నాయకులు ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సాప సాయిలు, బిఆర్ఎస్ పార్టీ గ్రామ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు నీటి మునిగి యువకుడు మృతి



నవతెలంగాణ-హవేలీ ఘనపూర్

ప్రమాదవశాత్తు నీట మునిగి యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని శమ్నాపూర్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. హవేళి ఘనపూర్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కుమ్మరి పోచయ్య (35) శుక్రవారం పొలానికి నీటిని సరఫరా చేసేందుకు వెళ్లాడు. బావిలో ఉన్న మోటారు పనిచేయక పోవడంతో కుమారుడు జస్వంత్‌తో కలిసి బావి వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో మోటారు పని చేయక పోవడంతో పోచయ్య బావిలోకి దిగి పైపును మరమ్మతులు చేసే క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో మునగగా, అక్కడే ఉన్న ద అతని కుమారుడు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. వారు వచ్చి పోచయ్యను బయటకు తీయగా అప్పటికే అతను మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని శవాన్ని మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. భార్య పుష్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

బైకు అదుపుతప్పి ఒకరు మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు

క్షతగాత్రులను ఆసుపత్రికి తరలింపు



నవతెలంగాణ-వెల్దుర్తి

బైకు అదుపుతప్పి ఒకరు అక్కడికక్కడ మృతి చెందగా, ఇద్దరు తీవ్ర గాయాల పాలైన సంఘటన మాసాయిపేట మండల కేంద్రంలో బంగారమ్మ గుడి వద్ద జాతీయ రహదారి 44పైన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం చేగుంట నుంచి తూప్రాన్ వైపు బయలుదేరుతున్న క్రమంలో జరిగింది. దౌల్తాబాద్ మండలం ఇందుప్రియల్ గ్రామానికి చెందిన రవి బేగంపేట గ్రామానికి చెందిన రాంబాబు, శివకుమార్‌లతో కలిసి వెళ్తుండగా ఈ పప్రమాదం జరిగింది. ఇందుప్రియల్ గ్రామానికి చెందిన బాయికాడ రవి (28)బైక్ నడుపుతుండగా అదుపుతప్పి బోల్తాపడడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మరో ఇద్దరు రాంబాబు, శివకుమార్‌లు ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన ఇద్దరిని అంబులెన్స్ ద్వారా తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రి తరలించినట్లు తెలిపారు. చీకటి కావడంతో పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

వివాహానికి మాజీ జెడ్పీటీసీ ఆర్థిక సహాయం



నవతెలంగాణ-శివ్వంపేట

మండలంలోని భీమ్లాతండా గ్రామపంచాయతీలోని గుగులోత్ దేవుల, జంకు దంపతుల కూతురు రాజేశ్వరి వివాహానికి తన వంతు సహాయంగా మాజీ జడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త రూ. 5 వేల ఆర్థిక సహకారాన్ని అందజే శారు. శుక్రవారం మాజీ సర్పంచులు కాట్రోత్ లక్ష్మణ్ నాయ క్, చెన్నా నాయక్, నాయకులు నరేష్ నాయక్, దేవేం దర్ నాయక్, సురేష్ నాయక్, రాజేందర్ లు ఈ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ లక్ష్మ ణ్ నాయక్ మాట్లాడుతూ అందరికి సహకారం అందించే మహేష్ గుప్తకు భీమ్లాతండా గ్రామపంచాయతీ ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరేందర్ నాయక్, సెహవాగ్, బాల్య నాయక్, పాల్గొన్నారు.

జామియా మస్జిద్‌లో ఘనంగా షబ్ ఎ బరాత్ వేడుకలు



నవతెలంగాణ-నార్సింగి

జామియా మస్జిద్‌లో షబ్ ఎ బరాత్‌ను పురస్కరించుకుని మండల కేంద్రంలోని జామియా మస్జిద్ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మస్జిద్‌లో అరబీ విద్యను అభ్యసిస్తున్న బాలలు, బాలికల చేత ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న పిల్లలకు బహుమతులను అందజేశారు. ప్రత్యేక కార్యక్రమం కోసం పిల్లలకు తర్ఫీదునిచ్చిన మస్జిద్ ఇమామ్ అహ్మద్ రజాను ప్రశంసించారు. పిల్లలు చురుగ్గా పాల్గొనడం పట్ల పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మస్జిద్ కమిటీ అధ్యక్షుడు చాంద్ ఖురేషి, ఉపాధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్, ప్రధాన కార్యదర్శి రబ్బానీ, క్యాషియర్ యూసఫ్, అక్కౌంటెంట్ సలీం షేక్ పాల్గొన్నారు.

మూడు ముక్కలాటతో ముక్కలవుతున్న సంసారాలు

- ఆన్లైన్ గేమ్‌లతో ఆగమవుతున్న యువత



నవతెలంగాణ-నిజాంపేట

మండలంలో ఎక్కడ చూసినా మూడు ముక్కలాటలే, ఆటలోనూ లక్షల కొద్ది డబ్బులు పోగొట్టుకుంటూ అప్పులు పాలవుతూ తమ సంసారాలను చిందరవందర చేసుకుంటున్నారు. పొద్దున మొదలుకొని సాయంత్రం వరకు, రాత్రి మొదలుకొని ఉదయం 5 గంటల వరకు మూడు ముక్కలాట జోరుగా కొనసాగుతున్నాయని మండ లంలో కొందరు వాపోతున్నారు. మద్యం తాగుతూ పేకాట ఆడుతూ మత్తులో ఎన్ని డబ్బులు పోగొట్టుకుంటున్నారో ఎవరికి అర్థం కాని పరిస్థితి. అప్పుల పాలవుతూ భూములను అమ్ముతూ కటిక దరిద్రంతో తమ పచ్చని సంసారాలలో చిచ్చు లేపుకుంటున్నారు. మరొక పక్క యువత ఆన్లైన్ గేమ్‌లతో అప్పుల పాలవుతూ లక్షల్లో అప్పులు చేస్తూ బంగారాన్ని, భూములను అమ్ముతూ మద్యానికి బానిసై మద్యం మత్తులో ఆత్మహ త్యలు చేసుకుంటున్నారు. ఆన్లైన్ గేమ్‌లతో ఆగమయితున్న యువత ను ఆదుకునేది ఎట్లా అని మండల ప్రజలు పలువురు చర్చించు కుంటున్నారు. ఆన్లైన్‌గేమ్‌లను, మూడు ముక్కలాటలను అదుపు చేసేలా ప్రభుత్వం, అధికారులు తగు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు. లేకుంటే సమాజంలోని యువత మొత్తం చెడు వ్యసనాలకు బానిసలై అతిగా ఆత్మహత్యలకు పాల్పడే అవకాశం ఉందని, వాటిని అరికట్టే బాధ్యత అధికారులపై ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందిగా నిర్వహించాలి

- నర్సాపూర్ ఆర్డీఓ మహిపాల్ రెడ్డి

నవతెలంగాణ-శివ్వంపేట

త్వరలో జరగబోయే శాసనమండలి ఎన్నికలను పకడ్బందిగా నిర్వహించాలని నర్సాపూర్ ఆర్డీఓ మహిపాల్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఏర్పాటు చేస్తున్న పోలింగ్ బూత్‌ల భవనాలను తహసీల్దార్ కమలాద్రితో కలిసి శుక్రవారం శివ్వంపేట ఉన్నత పాఠశాల భవనాన్ని పరిశీలించారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్నందున ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశానుసారం నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. భద్రత చర్యల గురించి ఆర్డీఓ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల గిర్దవర్ కిషన్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



ఆధారాలతో నిరూపిస్తాము

- పీఎసీఎస్ చైర్మెన్‌ను సస్పెండ్ చేయాల్సిందే
- మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నిమ్మ రమేష్



నవతెలంగాణ-టేక్మాల్

టేక్మాల్ ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షులు అవినీతికి పాల్పడినట్లు ఆధారాలతో సహా నిరూపిస్తామని, ఆయనను సస్పెండ్ చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నిమ్మ రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రాథమిక సహకార సంఘం కార్యాలయం ఆవరణలో ఆయన మాట్లాడారు. గత రెండు నెలల నుంచి కార్యాలయం ఫైళ్లు అధికారులు తీసుకొని సమగ్ర దర్యాప్తు చేసినట్లు చెప్పారు. ఈ దర్యాప్తులో రూ.2,21,44,935లు అవినీతి జరిగినట్లు ఆధారాలు ఉన్నాయని. జిల్లాస్థాయి అధికారులే రిపోర్టులు ఇచ్చారని చెప్పారు. ఇందుకు తగ్గ ఆధారాలు తమ దగ్గర ఉన్నాయని. ఇంతకంటే ఇంకేం ప్రూఫ్ కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మాన్ కిషన్, యూసుఫ్, నరేందర్, సత్యనారాయణ, మల్లేశం, రాజేష్, తదితరులు ఉన్నారు

సిద్ధంగా ఉన్న 3,500 బస్తాల యూరియా



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ మండలంలో రైతులకు సరిపడా ఎరువుల నిలువలు సిద్ధంగా ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయ అధికారి గంగమల్లు తెలిపారు. ప్రస్తుతం మండలంలో సుమారు 3,500 బస్తాల యూరియా విక్రయానికి ఎరువుల డీలర్ల వద్ద సిద్ధంగా ఉందని తెలిపారు. రైతులకు ఇంకా ఎంత అవసరం ఉన్నా తెప్పించనున్నట్లు తెలిపారు. డిఏపి 20 20, పొటాష్, అమోనియం,సూపర్ ఫాస్పేట్, ఇతర కాంప్లెక్స్ ఎరువులు రైతులకు అందుబాటులో ఉన్నాయని ఏవో గంగమల్లు తెలిపారు.

విద్యార్థులందరూ మంచి మార్కులతో పాస్ కావాలి

- పరీక్ష టైంలో సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-హవేలీ ఘనపూర్

విద్యార్థులందరూ మంచి మార్కులతో పాస్ కావాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం హవేలీ ఘనపూర్ మండలంలోని బురుగుపల్లి గ్రామంలో ఉన్న జెడ్పీ హైస్కూల్‌ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులను, వంటగదిని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు పలు ప్రశ్నలు అడిగి సమాధానాలును రాబట్టారు. విద్యార్థులకు గణితం, సైన్సు, ఇంగ్లీషు పాఠాలు బోధించి అందులో వారి సందేహాలను నివృత్తి చేశారు. తరగతి గదిలో విద్యార్థులను ఎక్కాలు, ఇంగ్లీష్ పాఠ్యాంశాలను చదివించారు. పదో తంగతి విద్యార్థులను రివిజన్ చేశారా అని అడిగారు. పరీక్షలకు వెళ్లేముందు మూడు నాలుగు సార్లు రివిజన్ చేయాలని పదవ తరగతి విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు చతుర్విధ ప్రక్రియలో ప్రావీణ్యాన్ని సంపాదించాలన్నారు. విద్యార్థులందరూ ఉత్తమ మార్కులతో పాసై పాఠశాలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని విద్యార్థులకు సూచించారు. సబ్జెక్టులలో ఎలాంటి సందే హాలు ఉన్నా ఉపాధ్యాయులతో నివృత్తి చేసుకోవాలన్నారు. టీవీ, ఫోన్, సోషల్ మీడియా లాంటి వాటికి పరీక్షల సమయంలో దూరంగా ఉండాలని విద్యార్థులకు తెలియజేశారు. పదవ తరగతి తర్వాత ఇంటర్మీడియట్లో విద్యార్థులందరూ జాయిన్ కావాలని విద్యార్థులను కోరారు. తల్లిదండ్రులు పిల్లల పరీక్షల కాలంలో వారికి సహకరించాలన్నారు. బూరుగుపల్లి పాఠశాలలో విద్యార్థులు ఉత్తమంగా చదువుతున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మధుమోహన్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

"పది" విద్యార్థుల అంతర్గత మార్కుల తనిఖీలు



నవతెలంగాణ-శివ్వంపేట

జరగబోయే పదో తరగతి వార్షిక పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ పరీక్షల తనిఖీ విభాగం ఆదేశాల మేరకు పదో తరగతి విద్యార్థుల అంతర్గత మార్కుల గురించి శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. గజిబెడ్ ఎచ్ఎం బాలచం ద్రం, వరగంటి సంతోష్ కుమార్, చక్రుసింగ్, ప్రసాదరావులు విద్యార్థులు తయా రు చేసిన ప్రాజెక్టు ప్రోగ్రెస్, రికార్డులను తనిఖీ చేశారు. మండలంలోని చెంది, పెద్దగొట్టిముక్కుల, శివ్వంపేట ఉన్నత పాఠశాల, కేజీబీవీలో విద్యార్థుల అంతర్గత మార్కులను తనిఖీ చేయడం జరిగింది. కొంతాన్ పల్లి, పాంబండ, దొంతి, రత్నాపూర్, పిల్లుట్ల పాఠశాలను కూడ తనిఖీ చేయడం జరుగుతుందని తనిఖీ బృందం సభ్యులు తెలిపారు. గత సంవత్సరం మాదిరిగా కాకుండా ప్రభుత్వ ఆదే శానుసారం ఈ యేడు వార్షిక పరీక్షలు 80 శాతం మార్కులకే విద్యార్థులకు పరీక్ష లు నిర్వహిస్తారని, మిగతా 20 మార్కులను రికార్డులు, ప్రాజెక్ట్ వర్క్ ద్వారా నిర్ణ యించబడుతుందని తనిఖీ బృందం సభ్యులు వరగంటి సంతోష్ కుమార్ తెలిపారు.

ఆయిల్ పామ్ పంటలను పరిశీలించిన అధికారులు



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ మండలంలోని రైతులు పండిస్తున్న ఆయిల్ పామ్ పంటలను నర్సాపూర్ సహాయ వ్యవసాయ సంచాలకులు సంధ్యా రాణి సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. మండలంలోని తుజాల్పూర్ గ్రామంలోని శ్రీనివాస్ రెండు ఎకరాలలో, శివంపేట్ మండలంలోని గంగాయిపల్లి గ్రామంలోని ఎస్.తారాబాయి 10 ఎకరాలలో ఆయిల్ పామ్ పంటలను పండిస్తున్నారు. ఆయిల్ పామ్ ప్లాంటేషన్ వ్యవసాయ, హార్టికల్చర్ డిపార్ట్మెంట్ అధికారుల ఆధ్వర్యంలో నర్సాపూర్ సహాయ వ్యవసాయ సంచాలకులు సంధ్యా రాణి సందర్శించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మండల వ్యవసాయ అధికారి దీపిక, శివంపేట్ వ్యవసాయ అధికారి లావణ్య, ఏఈఓ రవి వర్మ, ఆయిల్ పామ్ అధికారులు అజయ్, రైతులు పాల్గొన్నారు.



మల్కాపూర్‌లో శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టాపన



నవతెలంగాణ-తూప్రాన్

మల్కాపూర్‌లో ఈ నెల 15 నుంచి 17 వరకు శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహా సంస్థాన పీఠాధీశ్వరులు జగద్గురు అభినవోద్దండ విద్యాశంకర భారతీ మహ స్వామి పర్యవేక్షణలో ఈ కార్య క్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు అమిరిశెట్టి సతీష్ కుమార్, వీణలు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ ధర్మకర్తలు అమిరిశెట్టి సతీష్ కుమార్, వీణలు కోరారు.

ప్రతి ఒక్కరికి భరోసా కలిగించాలి

- జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ-మెదక్

సహాయం కోసం వచ్చే ప్రతి ఒక్కరిని మర్యాదపూర్వకంగా ఆహ్వానించి, వారికి మేమున్నామనే భరోసా కలిగించాలని జిల్లా ఎస్పి డి.ఉదయ్ కుమార్ రెడ్డి సిబ్బందికి సూచించారు. శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యలయంలో నూతనంగా నియామమైన పోలీస్ సిబ్బంది మొదటి బ్యాచ్ శిక్షణ ముగింపు కార్యక్రమానికి జిల్లా ఎస్పి డి.ఉదయ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వివిధ రకాల అభ్యర్థనల కోసం వచ్చే ప్రతి ఒక్కరిని మర్యాదపూర్వకంగా ఆహ్వానించి వారికి మేమున్నామనే భరోసా కలిగించాలన్నారు. ప్రతి పౌరుడికి సమన్యాయం జరిగేటట్లు చూడాలన్నారు. ప్రజలకు సత్వరన్యాయం జరిగడానికి సాంకేతిక వనరులను వినియోగించుకోవా లన్నారు. విదులలో మంచి ప్రతిభ కనబరిచి ప్రజల మన్ననలను పొందాలన్నారు. ఆదేవిధంగా ప్రతి ఒక్కరు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవారుచుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్‌బి ఇన్స్పెక్టర్ మధు సూధన్ గౌడ్, అనిల్ సీసీటీఎస్ఎస్ లక్ష్మీకాంత్ ఫాయాజ్ అలీ సిబ్బంది పాల్గొన్నారు.



లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవానికి ఆహ్వానం





నవతెలంగాణ-నిజాంపేట

బోనాల కొండాపూర్ లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవానికి హాజరు కావాలని శాసనమండలి వైస్ చైర్మెన్ బండ ప్రకాష్‌కు కే వెంకటాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు దయాకర్ ఆహ్వాన పత్రికను అందజేశారు. అదేవిధంగా మెదక్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డికి, మెదక్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్చార్జి కంటారెడ్డి తిరుపతిరెడ్డిలకు కూడా ఆహ్వాన పత్రికలను అందజేసి జాతర ఉత్సవాలకు రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం బోనాల కొండాపూర్ శివారులో వెలసిన లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం నిర్వహించడంతో పాటు సోమవారం ఎడ్లబండ్లు తిరుగుతాయని తెలిపారు. ప్రతి సంవత్సరము మాఘ మాసం నెలలో లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద మూడు రోజుల పాటు జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు . బైండ్ల వారి ఆట పాటలతో డప్పు చప్పులతో భారీ ఎత్తున ఊరేగింపు తీయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ఎంపీటీసీ సిద్ధ రాములు, కల్వకుంట పిఎసిఎస్ డైరెక్టర్ మహిపాల్, వార్డ్ మెంబర్ అక్కల రాజు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద వివాహానికి పుస్తె మట్టెలు అందజేత

- ఆపదలో ఉన్న వారికి అండగా మాజీ ఎంపీపీ
- ఊరికి పెద్దన్నగా మాజీ ఎంపీపీ స్వరూప నరేందర్ రెడ్డి



నవతెలంగాణ-వెల్దుర్తి

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలోగాని, పిలిస్తే పలికే మన ఊరి పెద్దన్నగా మాజీ ఎంపీపీ స్వరూప నరేందర్ రెడ్డి తన వంతు సేవలను అందజేస్తున్నారు. మండల పరిధిలోని మానేపల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబ యజమాని దుర్గయ్య కొడుకు వివాహానికి శుక్రవారం నరేందర్ రెడ్డి పుస్తె మట్టెలను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పెద్దలు మాట్లాడారు. మనసున్న మహారాజు, ఆకలితో అలమటిస్తున్న వృద్ధులను సైతం అక్కున చేర్చుకొని కడుపునిండా నిత్యన్నదానం చేస్తూ అందరికి చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు. అందరి చేత మన్ననలు పొందుతున్న ఏకైక నాయకుడు కాంగ్రెస్ జిల్లా నాయకుడు నరేందర్ రెడ్డి అన్న అని కొనియాడుతున్నారు. అనునిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజల బాగోగులు తెలుసుకుంటూచ ఆపద సమయంలో అండగా ఉండి వారి సమస్యలను తీర్చే వ్యక్తి అని, రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో అతన్ని గెలిపించుకుంటామని గ్రామస్తులు దీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మానేపల్లి గ్రామానికి చెందిన బంజ శ్రీశైలం, బ్రాహ్మణపల్లి సిద్ధిరాంరెడ్డి, మాజీ వార్డు నెంబర్ రమేష్, అనుగులపల్లి శ్రీనివాస్, చిట్యాల నరస గౌడ్, కిష్టా గౌడ్, బంజరాజు పాల్గొన్నారు.

శ్రీనివాస ఆర్ట్సను పునః ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-తూప్రాన్

మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, ప్రోప్రైటర్ నందాల శ్రీనివాస్‌కు చెందిన శ్రీనివాస ఆర్ట్సను మాజీ ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి శుక్రవారం పునః ప్రారంభించారు. శ్రీనివాస ఆర్ట్స్ షాప్ గత కొన్ని సంవత్సరాలుగా నడుస్తుండగా, దానిని నూతనంగా నిర్మించిన శ్రీనివాస ఆర్ట్స్ భవనంలోకి మార్చారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ జిల్లా నాయకులు నేత మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు రవీంద్ర కుమార్ రవీంద్ర గుప్తా, యూత్ అధ్యక్షులు నాగరాజుగౌడ్, సీనియర్ నాయకులు బజారు విశ్వరాజ్, కొత్తపల్లి నర్సింగరావు, సర్గల నర్సింగరావు, తాజా మాజీ కౌన్సిలర్లు శ్రీశైలం గౌడ్,రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సీలింగ్ భూమి పేదలకు ఇవ్వాలి

- వినతి పత్రం అందజేసిన ధర్మ సమాజ్ పార్టీ నాయకులు



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

ధరణి పోర్టల్‌లో జరిగిన తప్పిదాలను సరిచేసి నిరుపేదలకు సీలింగ్ భూములను ఇవ్వాలని ధర్మ సమాజ పార్టీ జిల్లా అధ్యక్షులు సదన్ మహరాజ్ అన్నారు. హుస్నాబాద్ మండలంలోని పోతారం ఎస్ గ్రామ పరిధిలోని సర్వేనెంబర్ 98లో ధరణి పోర్టల్ లో తప్పిదాలు జరిగాయని వెంటనే సవరించాలని శుక్రవారం ధర్మ సమాజ పార్టీ నాయకులు జిల్లా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో నిరుపేదల ఉండవలసిన తొమ్మిదేకరాల ఆరు గంటలు అగ్రకులాల రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు, భూస్వాముల పేరిట 6-38 గుంటల సీలింగ్ భూమి పట్టా పొందినట్లు తెలిపారు. ఆ సీలింగ్ భూమిని పట్టాగా మార్చే ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయంలో చొరవ తీసుకొని రెవెన్యూ అధికారుల చేత విచారణ చేసి ఆ గ్రామంలో ఉన్నటువంటి నిరుపేదలకి ఆ భూమిని పంచి ఇవ్వాలని ధర్మ సమాజ్ పార్టీ తరపున కోరుతున్నమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సదన్ మహరాజ్, జిల్లా నాయకులు బుగ్గ రాజు, యెల్లన్న, సతీష్‌లు పాల్గొన్నారు.

తపాస్ పల్లి నీటితో చెరువులను నింపాలి

నవతెలంగాణ-కొండపాక



తపాస్ పల్లి రిజర్వాయర్ నుంచి కొండపాక మండలంలోని చెరువులకు నీటిని తరలించాలని పలువురు రైతులు సిర్సనగండ్ల మాజీ సర్పంచ్ గూడెపు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో డీఈ అంజయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. శుక్రవారం పలువురు రైతులు తపాస్ పల్లి రిజర్వాయర్ వద్దకు వెళ్లి అధికారులతో మాట్లాడి తమ గ్రామాల చెరువులు నింపాలని కోరారు. అందుకోసం ఆల్టర్నేట్ గేటు తాను ఏర్పాటు చేస్తానని లక్ష్మారెడ్డి ఈ సందర్భంగా చెప్పారు. తపాస్ పల్లి రిజర్వాయర్ డి ఫోర్ కెనాల్ ద్వారా కొండపాక , సిరసనగండ్ల, మర్పడగ, దమ్మకపల్లి తదితర గ్రామాల చెరువులకు కాలువల ద్వారా నీటిని అందించాలని కోరారు. ఆల్టర్నేట్ గేటు లేకపోవడంతో తమ చెరువుల కు నీరు అందడం లేదని దానిని ఏర్పాటు చేపిస్తానని లక్ష్మారెడ్డి తెలిపాడు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన మాజీ మండలాధ్యక్షుడు

నవతెలంగాణ-నంగునూరు



తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను కాంగ్రెస్ మాజీ మండలాధ్యక్షుడు ఎం.డి ఇమ్రాన్ శుక్రవారం కలిశారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కలిసికట్టుగా కృషి చెయ్యాలని గాంధీ భవన్ లో యం.డి ఇమ్రాన్ కు సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారికి చైతన్యం చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ముందుకు వెళ్ళుతున్నదని తెలిపారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో అధిక స్థానాల్లో కాంగ్రెస్ అభిమానుల గెలుపుకోసం పని చెయ్యాలని సూచించారని ఎం.డి. ఇమ్రాన్ తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-దుబ్బాక



దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ మూడో వార్డుకు చెందిన కాపరబోయిన అభిలాష్‌కు ఎంపీ రఘునందన్ రావు సహకారంతో మంజూరైన రూ.84 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును వార్డ్ మాజీ కౌన్సిలర్ మట్ట మల్లారెడ్డి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ ఒగ్గు తిరుపతి,44 వ బూత్ అధ్యక్షులు ఆకుల నరేష్,శ్రీరాజు ఉన్నారు.

నిరుపేదరాలి వివాహానికి పుస్తే మట్టెలు అందజేత

నవతెలంగాణ-సిద్ధిపేట



వాసవి క్లబ్, వాసవి క్లబ్ వనిత వారి ఆధ్వర్యంలో నిరుపేదరాలైన స్వరూప వివాహానికి పుస్తే మట్టెలు, చీర, గాజులు అందించినట్లు జిల్లా వైస్ గవర్నర్ డా.మాంకాల నవీన్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక స్థోమత తక్కువ ఉన్నవారు ఇంట్లో ఆడపిల్లల వివాహం చేయాలంటే ఎంతో కష్టతరముగా ఉంటుందను, పుస్తే మట్టెలు వాసవి క్లబ్ వారు ఇస్తారని తెలుసుకోని తమను సంప్రదించగా, శుక్రవారం అందించినట్లు తెలిపారు. క్లబ్ సభ్యుల సహకారంతో ఇలాంటి కార్యక్రమాలు చేస్తూ, జిల్లా స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని క్లబ్బుల కార్యవర్గానికి సూచించారు. ఈ కార్యక్రమంలో పీఎస్టీలు మురంశెట్టి కుమార్, చిగుళ్లపల్లి మంజుల, చిగుళ్లపల్లి సత్యనారాయణ, ధనలక్ష్మి, బెజగామ రూప, రమేష్, పోశెట్టి శ్రీకాంత్, మర్యాల వీరేశం, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం మహా దానం

- ఎమ్మెల్సీ యాదవరెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్



రక్తదానం అనేది మహాదానమ ని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి అన్నారు. శుక్రవారం గజ్వేల్ వెంకటేశ్వర దేవాలయం ప్రాంగణం లో దత్త డయాగ్నస్టిక్ వారి ఆధ్వర్యం లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పీవీ నరసింహారావు బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాతల ద్వారా రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఐఎంఏ గజ్వేల్ ప్రెసిడెంట్ నాగమున్నయ్య,డాక్టర్ లింగం మాట్లాడుతూ.. ఆరోగ్యవంతంగా ఉన్న ప్రతి ఒక్కరు రక్తదానం చేయవచ్చు అని రక్తదానం వల్ల ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడిన వారమవుతామని, దత్త డయాగ్నస్టిక్ సెంటర్ వార్షికోత్సవం సందర్భంగా రక్తదానం శిబిరం ఏర్పాటు చేసిన డాక్టర్ బి సుజాత సాయి దంపతులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పురోహితులు శేషం శ్రీనివాస చార్యులు, డాక్టర్ నరేష్ బాబు, సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్సీ సంతోష్, ఫ్రెండ్స్ ఫర్ యు అసోసియేషన్ సభ్యులు, పాల్గొన్నారు.

ఫ్యూచర్ ప్రాపర్టీలో పురుషులకు ఉద్యోగ అవకాశాలు

నవతెలంగాణ-సిద్దిపేట

హైదరాబాద్‌లోని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ ఫ్యూచర్ ప్రాపర్టీలో పురుషులకు హైదరాబాద్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ రాజ లింగం తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఫ్యూచర్ ప్రాపర్టీ వారిచే 6 రోజుల శిక్షణ ఇవ్వబడునని, శిక్షణ సమయంలో భోజనము, యూనిఫాం, దూర ప్రాంతం వారికి ఉచిత హాస్టల్ సదుపాయాలు అందించబడునని తెలిపారు. ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5: 30 వరకు శిక్షణ ఉంటుందని, శిక్షణ అనంతరం అర్హత సాధించిన వారికి రూ.18వేలు, ఇన్సెంటివ్స్ ఇవ్వబడునని తెలిపారు. జిల్లాలలోనీ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న 18 నుండి 35 ఏండ్లు ఉన్న యువత సద్వినియోగం చేసుకోవాలని, ఆసక్తి ఉన్న వారు తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డు, 3 ఫోటోలతో జిల్లా గ్రంథాలయం ఎదురుగా ఉన్న యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈ నెల 17 లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 9949 88 2026 నెంబర్ ను సంప్రదించాలని సూచించారు.

నీటి వృథాను అరికడదాం: శ్రీరాం నరేందర్

నవతెలంగాణ-దుబ్బాక



ఎండాకాలం సమీపిస్తున్న వేళ ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని మాజీ ఆత్మ కమిటీ డైరెక్టర్ శ్రీరాం నరేందర్ కోరారు. నీటి సమస్యలు తలెత్తకుండా వృథాను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. శుక్రవారం దుబ్బాక పట్టణ కేంద్రంలోని 18వ వార్డులో వివేకానంద స్కూల్ ఎదురుగా ఉన్న మినీ ట్యాంకు నల్లాల నుంచి నీరు లీకవకుండా ఉండేందుకు నూతనంగా ట్యాప్‌లను బిగించడం జరిగింది. వార్డు ప్రజలకు ఏ సమస్య తెలెత్తినా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ నాయకులు ఆకుల భరత్, ఐరేని సాయితేజ గౌడ్ ఉన్నారు.

ప్రభుత్వ బాలికల పాఠశాలలో లాంగ్వేజ్ డే

నవతెలంగాణ-సిద్ధిపేట



విద్యార్థులకు ఇంగ్లీష్ లాంగ్వేజ్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించామని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నీలకంఠ మనోహర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. గత రెండు రోజుల నుంచి విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, డ్రాయింగ్, స్పెల్లింగ్ టెస్ట్, డ్రామాలు, సాంగ్స్ కాంపిటీషన్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రథమ, ద్వితీయ స్థానాలను పొందిన విద్యార్థులకు బహుమతులను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉదయశ్రీ, కోట ప్రభు, శ్రీనివాస్ గౌడ్, పద్మలత, ఫిజికల్ డైరెక్టర్ పి. సుజాత, అశోక్ రెడ్డి, మల్లయ్య, సిద్దేశ్వర్, వెంకట నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ జన్మదిన వేడుకల కరపత్రం విడుదల

నవతెలంగాణ-గజ్వేల్



కేసీఆర్ జన్మదిన వేడుకల సందర్భంగా గ్రీన్ తెలంగాణగా మార్చాలని లక్ష్యంతో ముందుకు వెళున్నామని ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ ప్రతాప్ రెడ్డి అన్నారు. బుధవారం సంబంధిత కరపత్రాన్ని విడుదల చేశారు. మాజీ ఎంపీ సంతోష్‌కు ఛాలెంజ్ భోగినపల్లి సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో చేస్తున్న వృక్షారక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు కృషి చేస్తున్నామన్నారు. గత పది ఏండ్లుగా తెలంగాణను ఆకుపచ్చ తెలంగాణలో మార్చినట్లు ఆయన గుర్తు చేశారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో ఆకస్మికంగా తనిఖీ

- జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల పట్టణ కేంద్రంతోపాటు మండలంలోని ముస్త్యాల గ్రామంలో పలు ప్రభుత్వ కార్యాలయాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పట్టణ కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల/ జూనియర్ కళాశాలను సందర్శించిన కిచెన్ హాల్, స్టోర్ రూమ్, డైనింగ్ హాల్‌లను పరిశీలించారు. పదవ తరగతిలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టోర్ రూమ్‌లో వంట సరుకులను పరిశీలించి పెరిగిన డైట్ చార్జీల ప్రకారం నాన్యమైన ఆహార పదార్థాలను మాత్రమే వండి విద్యార్థులకు వడ్డించాలని ప్రిన్సిపాల్ పుల్లయ్యను ఆదేశించారు. విద్యాలయంలో ప్రహరీ గోడ మరమ్మత్తులు, డార్మెటరీలో కిటికీల రిపేర్లు, రైస్ స్టీమ్ యూనిట్ లకు ఈడబ్ల్యూఐడిసి ఇంజనీర్ల ద్వారా ప్రతిపాదనలు పంపించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో..

ముస్త్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను తనిఖీ చేసి ఆస్పత్రిలో వివిధ గదులను పరిశీలించారు. ఏఎన్సీ, ఈడీడీ, ఓపి స్టాఫ్ హాజరు, ఆరోగ్య మహిళ తదితర రిజిస్టర్‌లను పరిశీలించి బాలింతల వివరాలను సరిగా నమోదు చేసి ఏ నెల ఎంతమంది ప్రసవాలు జరిగే అవకాశం ఉందో మానిటరింగ్ చేస్తూ ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. ఆరోగ్య మహిళ వైద్య పరీక్షలు షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని అన్నారు. ఆసుపత్రి వైద్యాధికారి సెలవులో ఉన్నారని సిబ్బంది తెలపడంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పల్వాన్ కుమార్ కు ఫోన్ చేసి నిర్ధారించుకున్నారు. ఫార్మసీలో మెడిసిన్ ను పరిశీలించి మెడిసిన్ ఎక్స్పైరీ రిజిస్టర్ సరిగా మెయింటైన్ చేయకపోవడంతో కొంత అసహనం వ్యక్తం చేసి మెడిసిన్ స్టాక్ రిజిస్టర్ ప్రాపర్ గా మెయింటైన్ చేయాలని, ఎక్స్పైరీ రిజిస్టర్ మైంటైన్ చేసి ఎక్స్పైరీ అయిన మెడిసిన్ ని వాడకుండా వాటి స్థానంలో ముందుగానే మెడిసిన్ తెప్పించుకోవాలని ఫార్మాసిస్టును ఆదేశించారు. ప్రతి నెల ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలతో పీహెచ్సీ స్థాయి రివ్యూ మీటింగ్ నిర్వహించాలని ఆదేశించారు.


ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణ పనుల పరిశీలన..

అనంతరం తహసిల్దార్ కార్యాలయం ఆవరణలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని తహసిల్దార్ ను ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయ భవనంలో నిర్వహిస్తున్న ఎస్సీ బాలుర హాస్టల్‌ను సందర్శించి డార్మెటరీ, కిచెన్ హాల్, స్టోర్ రూమ్లను పరిశీలించి పెరిగిన డైట్ మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని, ఆహారం వండే సరుకులను నాణ్యమైన వాటిని తీసుకోవాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ రాజయ్య, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ సత్యనారాయణ లను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సమీర్ హమ్మద్ ఖాన్, ఎంపీడీవో మహమూద్ అలీ పాల్గొన్నారు.

ఎకరన్నర ఉన్నా రైతు భరోసా సున్నా

నవతెలంగాణ-అక్కన్నపేట





రాష్ట్ర ప్రభుత్వం రైతులకు విడతల వారీగా రైతు భరోసా డబ్బులను వారి వారి బ్యాంక్ అకౌంట్లలో జమ చేస్తుంది. ఇప్పటివరకు మూడు ఎకరాలలోపు ఉన్న రైతులందరికీ భరోసా డబ్బులు అందాయి. కానీ అక్కన్నపేట మండలం రామవరం గ్రామానికి రిక్కల వెంకటరెడ్డికి 1 ఎకరం 20 గుంటల భూమి ఉన్న రైతు భరోసా మాత్రం పడలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై శుక్రవారం వ్యవసాయం విస్తరణ అధికారిని అడగ్గా డబ్బులు ప్రాసెసింగ్‌లో ఉన్నాయని త్వరలోనే జమవుతాయని సమాధానం ఇచ్చారు. దీంతో రైతు వెంకట్ రెడ్డి ఏం చేయాలో తెలియక సతమతమవుతున్నారు. ఈ విధంగా రైతు భరోసా విషయంలో చాలామంది రైతులకు అన్యాయం జరుగుతోందని వెంకట్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దళిత కార్మికుడిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

- గ్రామపంచాయతీ సిబ్బందికి రక్షణ కల్పించాలి
- సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య
- ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా





నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండల కేంద్రం గ్రామంలో దళితుడైన గ్రామపంచాయతీ కార్మికుడు నర్సింలు గ్రామ పంచాయతీ ముందర విధులు నిర్వర్తిస్తుంటే గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్తలు హరికిషన్, మధులు అసభ్యంగా దూషిస్తూ దాడి చేశారు. వారిని వెంటనే కఠినంగా శిక్షించాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఎంపీడీవో, ఎంపీఓ అధికారులతో చర్చించారు. గ్రామపంచాయతీ సిబ్బందికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. గజ్జె నరసింహులు పంచాయతీ కార్యదర్శి ఆదేశాల మేరకు గ్రామంలో ఫ్లెక్సీలు తొలగిస్తుండగా గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్తలు దాడి చేయడం ఏమిటని ప్రశ్నించారు. గ్రామంలో ఉన్న చెత్తను మురికిని శుభ్రం చేస్తూ ప్రజలందరికీ ఆరోగ్యాన్ని కల్పిస్తున్నటువంటి దళితులైన గ్రామపంచాయతీ కార్మికులపై దాడి చేయడం ఏంటని, కనీస విచక్షణ లేకుండా ప్రజలు ఉండగానే అసభ్యంగా దూషిస్తూ దాడి చేయడం జరిగిందన్నారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని లేనిచో జిల్లా వ్యాప్త ఆందోళన చేపడతామని హెచ్చరించారు. దాడికి గురైన గ్రామపంచాయతీ కార్మికుడిని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు దర్శనం రమేష్ పరామర్శించారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవి, జిల్లా కమిటీ సభ్యులు అమ్ముల బాల నర్సయ్య, బర్మ కొమురయ్య, జాలిగామ ప్రభాకర్, పల్లె శ్రీనివాస్, ఆరుట్ల నర్సింలు, గొడుగు నారాయణ, సుధాకర్, కొమ్ము ఆంజనేయులు, గణేష్, గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

అంగన్వాడీ టీచర్లను వేధింపులకు గురిచేస్తున్న సూపర్వైజర్

- హెల్పర్ ఫోన్‌ను లాక్కొని వ్యక్తిగత స్వేచ్ఛను హరించిన అధికారి
- కక్ష సాధింపుతో మెమో జారీ చేసి వేధింపులక పాల్పడుతున్న వైనం



నవతెలంగాణ-తొగుట

అంగన్వాడి టీచర్లను, హెల్పరను వేధింపులకు గురిచేస్తున్న సూపర్వైజర్‌పై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి జి. భాస్కర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మాట్లాడు తూ మండల కేంద్రంలోని అంగన్వాడీ 3వ సెంటర్‌లో పని చేస్తున్న హెల్పర్ లక్ష్మికి సూపర్వైజర్ అమ్తుల్ విచిత్రమైన పద్ధతిలో మెమో జారీ చేసి వేదింపులకు పాల్పడుతున్నదని ఆరోపించారు. సెంటర్‌లొ గ్రోత్ మిషను పైన దుమ్ము పడిందని దీనివల్ల నువ్వు సరైన పని చేయడం లేదని మేమొ జారీ చేయడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. అంతే కాకుండా అంగన్వాడీ హెల్పర్ లక్ష్మీకి సంబంధించిన వ్యక్తిగత ఫోనును బలవంతంగా లాక్కొని నువ్వు రోజు ఎవరెవరికి ఫోన్ చేస్తున్నావు. నాకు సమాచారం కావాలని అక్రమంగా ఫోన్ నుంచి వ్యక్తిగత స్వేచ్ఛను హరించడం ఇది పూర్తిగా చట్టా విరుద్ధమన్నారు. వ్యక్తి గత స్వేచ్ఛను హరించిన సూపర్వైజర్‌పై జిల్లా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో గురువారం సూపర్వైజర్ ఇచ్చిన మేమొలను సీఐటీయూగా ఓపికతో, సహనంతో పరిష్కారం చేస్తున్నామని మా సహనాన్ని ఐసీడీఎస్ అధికారులు పరీక్షించాలనుకుంటే ప్రత్యక్ష పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. గతంలో సూపర్ వైజర్ తన భర్తతో టీచర్లను బెదిరించిన సందర్భాలు ఉన్నాయని ఈ విధంగా వ్యక్తిగత కక్షలతో సూపర్వైజర్ పని విధానం పూర్తిగా ఐసీడీఎస్ కు విరుద్ధంగా ఉందని ఎద్దేవా చేశారు. ఇలాంటి సూపర్ వైజర్ వలన నిరుపేదలకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా లక్ష్మికి మంజూరు చేసిన మెమోను వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని యెడల ప్రాజెక్టు స్థాయిలో పెద్ద ఎత్తున ఆందోళన, పోరాటాలకు సిద్ధపడతామని అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సతీష్, స్వామి పాల్గొన్నారు.

చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవు





నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

ఎవరైనా చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హుస్నాబాద్ ఎస్ఐ తోట మహేష్ అన్నారు. హుస్నాబాద్ మండలంలోని పందిళ్ళ గ్రామంలో గురువారం రాత్రి గ్రామస్తులకు రాబోవు ఎన్నికల సందర్భంగా ప్రజలందరూ కలిసిమెలిసి ఉండాలని అవగాహన కల్పించారు. ఎన్నికలు వస్తుంటాయి పోతుంటాయి వాటిని అడ్డం పెట్టుకొని గొడవలకు దిగవద్దని శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహించడానికి గ్రామస్తులు సహకరించాలని సూచించారు. ప్రజల రక్షణ, సెన్సాఫ్ సెక్యూరిటీ, సీసీ కెమెరాల ఏర్పాటుపై మాట్లాడారు. ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల జోలికి వెళ్ళవద్దని సూచించారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930 సైబర్ సెల్ జాతీయ హైల్ప్ నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. గ్రామంలో ఎవరు కూడా బెల్ట్ షాప్ నడపవద్దని సూచించారు. ఎవరన్నా అనుమానాస్పదంగా కనిపించిన వెంటనే డయల్ 100 కు కాల్ చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తోడేటి రమేష్, మాజీ ప్రజా ప్రతినిధులు గ్రామ యువకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ-తొగుట

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలాంటి గొడవలు పెట్టు కోవద్దని తొగుట ఎస్సై రవికాంతరావు అన్నారు. శుక్రవారం మండలంలోని తుక్కాపూర్ గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలందరు కలిసిమెలిసి ఉండాలని ఎన్నికలు వస్తుంటాయి పోతుంటాయి అన్నారు. వాటిని అడ్డం పెట్టుకొని గొడవలకు దిగవద్దని శాంతియుత వాతా వరణంలో ఎన్నికల నిర్వహించడానికి గ్రామస్తులు సహకరించాలని సూచించారు. ప్రజల రక్షణ, సెన్సాఫ్ సెక్యూరిటీ గురించి సీసీ కెమెరాలు చాలా ముఖ్యం తెలిపారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల జోలికి వెళ్ళవద్దు అన్నారు. ఎవ రైనా సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930 సైబర్ సెల్ జాతీయ హైల్ప్ నెంబర్ కు ఫోన్ చేసి ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. గ్రామంలో ఎవరు బెల్ట్ షాప్ నడపవద్దని హెచ్చరిం చారు. గ్రామంలో ఎవరైనా చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు నిర్వహించిన ఎవరన్నా అనుమానా స్పదంగా కనిపించిన వెంటనే డయల్ 100 కు కాల్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజల్ను, ప్రజా ప్రతినిధుల్ను, పోలీస్ సిబ్బందిపాల్గొన్నారు.

యజమానులు యూజర్ చార్జీలు చెల్లించాలి

- ఫంక్షన్ హాళ్లపై చట్టపరమైన చర్యలుంటాయి
- కమిషనర్ గోల్కొండ నరసయ్య

నవతెలంగాణ-గజ్వేల్



మున్సిపల్ చట్టం ప్రకారం ఫంక్షనల్ హాల్ యజమానులు యూజర్ చార్జీలను చెల్లించాలని కమిషనర్ గోల్కొండ నరసయ్య తెలిపారు. శుక్రవారం మున్సిపల్ మీటింగ్ హాల్లో పట్టణంలో ఉన్న ఫంక్షన్ హాల్ యజమానులతో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడుతూ..నిర్వాకులు యూజర్ చార్జీలతోపాటు తడి ,పొడి చెత్త వేరువేరుగా చేసి అందించాలన్నారు. లైసెన్సులు లేని ఫంక్షన్ హాల్ వెంటనే లైసెన్సులు పొందాలన్నారు. మున్సిపల్ చట్టంకు లోబడి ఫంక్షన్ హాల్ నిర్వహించాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం చేసినట్లు చెప్పారు. ఫంక్షణాల్లో పెళ్లిళ్లు పేరంటాలు అయిన తర్వాత తడి పొడి చెత్తను వేరుచేసి మున్సిపాల్ సిబ్బందికి అప్పగించాలన్నారు. అలా కాకుండా కొందరు రోడ్లపై వేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్లాస్టిక్ కవర్లు పట్టణ వ్యాపారులు ప్రజలకు సామాగ్రితో ఇవ్వవద్దన్నారు. వాటి స్థానంలో జూట్ బ్యాగులను వాడుకోవాలన్నారు. కాలుష్య నివారణకు ప్రజలు సహకరించవలసిన అవసరం ఉందన్నారు. వేసవికాలం ఉన్నందున నర్సరీలకు, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పట్టణంలో హరితహారం మొక్కలకు నీటి ఏర్పాటు చేస్తున్నమన్నారు. వేసవిలో మొక్కలు ఎండిపోవద్దని సిబ్బందికి సూచించారు. ఈ సమావేశంలో శానిటైజర్ ఇన్స్పెక్టర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రాజగోపాల్ పేటలో వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్

నవతెలంగాణ-నంగునూరు



వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్‌లో భాగంగా యంపీ 5 రైఫిల్, గ్లాక్ పిస్టల్‌తో పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ ఫైర్ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. శుక్రవారం శిక్షణలో భాగంగా నంగునూరు మండలం రాజగోపాల్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఫైరింగ్ ప్రాక్టీస్ రేంజ్‌లో పోలీస్ అధికారులకు 9 ఎం.ఎం పిస్టల్, ఇతర వెపన్స్‌తో ఫైరింగ్ చేశారు. జిల్లాలో ఉన్న పోలీస్ సిబ్బంది, ఎస్ఎల్ఆర్, ఇన్సాస్ వెపన్స్ తో ఫైరింగ్ చేపట్టారు. ఫైరింగ్ చేస్తున్న అధికారులు, సిబ్బంది ఫైరింగ్ విధానాన్ని పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.శిక్షణ ద్వారా సిబ్బందికి వ్యూహాత్మక నైపుణ్యాలతో శిక్షణ ఇవ్వడంతో పాటు వ్యూహాత్మకంగా ఆలోచించడం నేర్పింపబడుతుందన్నారు. దీంతో పోలీసులు ఆత్మవిశ్వాసంతో విధులు నిర్వర్తించే వీలు కలుగుతుందని చెప్పారు. సమీపం నుంచి ప్రత్యర్థిని ఎదుర్కోవడం, ముష్కరులను నిరాయుధులను చేయడం, వ్యూహంగా మారి తలపడడం, స్కిల్ డెవలప్మెంట్ తదితర అంశాల గురించి పోలీసులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది అందరూ ఫైరింగ్‌చేయడం జరిగిందన్నారు. ఫైరింగ్ లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులను, సిబ్బందిని అభినందించి త్వరలో రివార్డులు, అవార్డు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, ఆర్ఐ లు విష్ణు ప్రసాద్, ధరణి కుమార్, రాజేష్, కార్తీక్ ఆర్ఎస్ఐలు, రంజిత్, బాలకృష్ణ, సాయి చరణ్, నిరంజన్, ఫైరింగ్ ప్రాక్టీస్ లో అధికారులకు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగు సూచనలు చేస్తూ ఫైరింగ్ ప్రాక్టీస్ విజయవంతంగా పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఫైరింగ్ ప్రాక్టీస్ లో పాల్గొన్న అధికారులు ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, ఏసీపీలు, తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి



నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లకు అమలకు చట్టబద్ధత కల్పించాలని బీసీ ఐక్యవేదిక సంఘం నాయకులు అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో బీసీ ఐక్యవేదిక సంఘం నాయకులు సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ కోఆర్డినేటర్ మేకల వీరన్న యాదవ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీలకు సామాజిక న్యాయం జరిగేలా 42శాతం బీసీలకు రిజర్వేషన్ అమలుకు సహకరించిన బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ ,రాష్ట్ర ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా బీసీలకు న్యాయం చేసే దిశగా కృషి చేసిందన్నారు. అన్ని రంగాల్లో బీసీలకు న్యాయం జరిగేల రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షనీయమన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా ఓబీసీలకు చట్టబద్ధత కల్పించే విషయంలో సహకరించాలన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు, విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లకు చట్టబద్ధుల కల్పించి ఒకే బిల్లుగా నిర్ణయం తీసుకోవడం చరిత్రలో నిలుస్తుందన్నారు. కులగణన సర్వేలో పాల్గొనని వారికి అవకాశం కల్పించడం మంచి నిర్ణయం అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం బాధ్యులు మార్క అనిల్ గౌడ్, బీసీ నాయకులు జంగపల్లి ఐలయ్య, బుర్ర పరశురాం గౌడ్, ముంజ శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రైతు భీమాను కూలీలకు వర్తింపచేయాలి

- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్



నవతెలంగాణ-గజ్వేల్

రైతులకు అమలు చేస్తున్న రైతు భీమా పథకాన్ని కూలీ కుటుంబాలకు వర్తింప చేయాలని దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. అప్పుల బాధ లతో ఆత్మహత్య చేసుకున్నగజ్వేల్ మండలం గిరిపల్లి గ్రామానికి చెందిన దళితులైన తండ్రి బండారి మల్లయ్యకొడుకు రవిందర్ ల కుటుంబాన్ని డీబీఎఫ్ నేతలు శంకర్, దాసరి ఎగొండ స్వామిలు శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుటుంబం ఆర్థిక ఇబ్బందులు, అప్పుల బాధతో తండ్రి కొడుకులు ఆత్మ హత్య చెసుకొవడం బాధకరమన్నారు. ప్రభుత్వం స్పందించి దళిత కూలీ కుటుంబాలను ఆదుకొవాలన్నారు. తండ్రి మల్లయ్య చనిపొయి మూడు నెలల అవుతున్న రైతు భీమా పథకం మంజూరు లో వ్యవసాయ, ఎల్.ఐ.సి, పోలీసు అధికారులు నిర్లక్ష్యం విడనాడి వెంటనే మంజూరు చేయాలన్నారు. మృతుల భార్యలు సుశీల,అనిత లకు వితంతు పెన్షన్ లను మంజూరు చేయాలన్నారు. మృతుడు రవిందర్ ముగ్గురు కుమార్తెలైన స్నేహ, లౌక్య, రుషిక ల ఉన్నత చదువుల బాధ్యతను ప్రభుత్వం చెపట్టాలన్నారు.జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (ఎన్.ఎఫ్.బీ.ఎస్) పథకం కింద ఆర్థిక సాయం అందించాలన్నారు.

తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థులకు దుస్తుల పంపిణీ



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండలం ముస్త్యాల గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న తల్లిదండ్రులను కోల్పోయిన పేద విద్యార్థులకు కామ్రేడ్ కొంగరి నారాయణ స్మారక విజ్ఞాన సేవా సంఘం ముస్త్యాల ట్రస్టు ద్వారా స్కూల్ యూనిఫాం తెల్ల దుస్తులను సేవా ట్రస్టు అధ్యక్షులు కొంగరి వెంకట మావో, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయుల సమక్షంలో శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొంగరి వెంకట మావో మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని పట్టుదలతో బాగా చదివి క్రమశిక్షణను అలవర్చుకుంటూ ముస్త్యాల పాఠశాలకు, చదువు చెప్పే గురువులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని, సమాజంలో గౌరవంతో ఉత్తములుగా నిలవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రేపాక కుమార్, గుండ్ర రవీందర్, కొంగరి కృష్ణమూర్తి, పాల్గొన్నారు.

నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
శనివారం | 15 ఫిబ్రవరి 2025 | www.navatelangana.com

మంచి ఫలితాల కోసం కష్టపడి చదవాలి

-గజ్వేల్ ఆర్డీవో వీఎల్. చంద్రకళ



నవతెలంగాణ-మర్కూక్

మంచి ఫలితాల కోసం కష్టపడి చదవాలని, పదో తరగతి విద్యార్థులు పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో మానసిక ఒత్తిడికి గురుకాకుండా ఉండేందుకు సమయపాలన పాటించాలని గజ్వేల్ ఆర్డీవో వి.వి.ఎల్. చంద్రకళ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రమైన మర్కూక్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను సందర్శించి పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పదవ తరగతి పరీక్షలకు సమయం చాల తక్కువగా ఉన్నందున ఈ సమయంలో ఒత్తిడికి గురికాకుండా విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా వివిధ సబ్జెక్టులను పూర్తిగా చదవాలన్నారు. అవసరమైతే ఉపాధ్యాయుల సలహాలు, సూచనలను ఎప్పటికీ అప్పుడు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో భాగంగా మర్కూక్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను సందర్శించారు. అనంతరం పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశం,మర్కూక్ తహసీల్దారు ప్రవీణ్ రెడ్డి, ఆర్ఐలు శ్రీధర్ ,హరీశ్ ,ఉపాధ్యాయులు సిద్ధయ్య,రమణారావు, శ్రీనివాస్ రావు,విద్యార్థులు ,తదితరులున్నారు.

మున్సిపల్ చైర్మెన్ బరిలో కూరాకుల శ్రీనివాస్..!



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పాలకవర్గం ఇటీవల ముగిసిన సందర్భంగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్‌లో రాజకీయ వేడి సంతరిం చుకుంది. అందులో భాగంగా శుక్రవారం తాజా మాజీ కౌన్సిలర్ కూరాకుల శ్రీనివాస్ తన ఆత్మీయులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్మెన్ పీఠం ఎస్టీకి రిజర్వేషన్ అయితే బరిలో నిలబడడానికి సిద్ధంగా ఉన్నట్టు తన ఆత్మీయులతో చర్చిస్తున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గత ఐదు ఏండ్లు కౌన్సిలర్‌గా అవకాశం ఇచ్చిన నా వార్డు ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు అని సేవ చేయడంలో తృప్తి ఉంటుందని, సేవే పరమావధిగా ముందుకు సాగడం జరుగుతుందని ప్రజలు అవకాశం ఇచ్చి దేవుడు కరుణించి మున్సిపల్ చైర్మెన్ ఎస్టీగా రిజర్వేషన్ వస్తే కచ్చితంగా చైర్మెన్ బరిలో ఉంటానని ధీమా వ్యక్తం చేశారు.

నేటి నుంచి సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ-నంగునూరు



నంగునూరులో తోకల కొండపై వెలసిన అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు కళ్యాణకర్త శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ఈ నెల 17 వరకు నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మెన్ కోల రమేశ్ గౌడ్ తెలిపారు. నేడు బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ, ప్రత్యేక పూజలు, 16న ఆదివారం శకటోత్సవం (బండ్లు తిరుగుట) 17 న సీతారామచంద్రస్వామి కళ్యాణోత్సవం అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాత్రి బెజ్జంకి ఒగ్గు కళాకారుల బృందంచే ఒగ్గు కథ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవముగా జరుగును. భక్తులందరు ఉత్సవాలను తిలకించి ప్రసాదములను స్వీకరించి స్వామి కృపకు పాత్రులు కాగలరని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

దామోదరం సంజీవయ్య చిత్రపటానికి నివాళులు

నవతెలంగాణ-సిద్ధిపేట



స్వతంత్ర భారత దేశంలో తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి గాంధీభవన్‌లో నివాళులు అర్పించినట్లు జిల్లా యువజన కాంగ్రెస్ సెక్రటరీ ఎర్రబోలు రాజా రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండో ముఖ్యమంత్రి, తొలి దళిత ముఖ్యమంత్రి అని, అనేక సార్లు మంత్రి పదవిని నిర్వహించారని, రెండుసార్లు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ పట్టణ అధ్యక్షులు సాదుల సాయి ప్రతాప్, సిద్ధిపేట పట్టణ ఎస్సీ సెల్ నాయకులు మోత్కూరి రవి, మోత్కూరి శ్రీనివాస్, యువజన నాయకులు మోత్కూరి యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

యూ టర్న్ తీసుకుంటుండగా..

-ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన మరో ద్విచక్ర వాహనం
-చికిత్స పొందుతూ ఒకరు మృతి
-మరో ఇద్దరికి గాయాలు




(ఫైల్)

నవతెలంగాణ-బెజ్జంకి

యూ టర్న్ తీసుకుంటున్న ద్విచక్ర వాహనాన్ని మరో ద్విచక్ర వాహనం డీకొట్టిన సంఘటన మండల పరిధిలోని రేగులపల్లి గ్రామ స్టేజ్ రాజీవ్ రహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం కరీంనగర్ జిల్లా మానకొండూర్ గ్రామానికి చెందిన అభిషేక్(23)తన బంధువు భాను ప్రసాద్ ఇరువురు ద్విచక్ర వాహనంపై వెళ్తూ రేగులపల్లి గ్రామ స్టేజ్ వద్ద యూ టర్న్ తీసుకుంటుండగా సిద్ధిపేట నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. ద్విచక్ర వాహనదారులకు తీవ్ర గాయాలవ్వగా చికిత్స నిమిత్తం సిద్ధిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అభిషేక్ మృతి చెందాడు. మృతుని తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు మరో ద్విచక్ర వాహ నదారుడు అభినయ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ క్రిష్టారెడ్డి తెలిపారు.

కరకపట్ల గ్రామాన్ని సందర్శించిన ఏఎస్ఐ

నవతెలంగాణ-మర్కూక్



రానున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్టిలో ఉంచుకుని ప్రజలందరూ కలిసిమెలిసి ఉండాలని, గొడవలకు దిగవద్దని శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహించడానికి గ్రామస్తులు సహకరించాలని మర్కూక్ ఏఎస్ఐ రవీందర్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని కర్కపట్ల గ్రామంలో సైబర్ నేరాలపై ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల జోలికి వెళ్ళవద్దన్నారు. గ్రామంలో ఎవరైనా చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు నిర్వహించినట్లయితే , ఎవరన్నా అనుమానాస్పదంగా కనిపించిన వెంటనే డయల్ 100 కు కాల్ చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ శ్రీకాంత్ రెడ్డి,గ్రామ ప్రజలు, ప్రజా ప్రతినిధులు,తదితరులున్నారు.

అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యం పట్టివేత


నవతెలంగాణ-దౌల్తాబాద్



రేషన్ బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తే కొంతమంది అక్రమార్కులు వ్యాపారంగా మారుస్తూ విక్రయిస్తున్నారు. శుక్రవారం మండలం శేరిపల్లి గ్రామంలో ఒక ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం నమ్మదగిన సమాచారం మేరకు సిద్ధిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జోడు బిక్షపతి ఇంట్లో సోదాలు నిర్వహించగా అక్రమ రేషన్ బియ్యం లభించినట్లు వారు తెలిపారు. జోడు బిక్షపతి పై కేసు నమోదు చేయడం జరిగిందని దౌల్తాబాద్ ఎస్సై శ్రీరామ్ ప్రేమ్ దీప్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమంగా నిల్వ ఉంచిన 17 బస్తాలు, 6 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. పంచనామా పూర్తి చేసిన తర్వాత చట్ట ప్రకారం చర్యలుంటాయన్నారు. మండలంలో ఎవరైనా ఇలాంటి కార్యక్రమాలకు పాల్పడుతున్న సమాచారం ఉంటే రెవెన్యూ అధికారులకు కానీ, డయల్ 100, పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ,టాస్క్ ఫోర్స్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం

నవతెలంగాణ-దుబ్బాక



త్వరలో జరగబోవు మండల పరిషత్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని దుబ్బాక అసెంబ్లీ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బురాని శ్రీకాంత్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులుగా తూముకుంట ఆకాంక్ష రెడ్డి నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం గాంధీభవన్‌లో ఆకాంక్ష రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్, కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాలను అసరిస్తూ, ఆకాంక్ష రెడ్డి సూచనలతో.. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. యువజన కాంగ్రెస్ సిద్ధిపేట జిల్లా ఉపాధ్యక్షులు సిందం శశికాంత్, ప్రధాన కార్యదర్శి అనిల్ గౌడ్,రాయపోలు మండలాధ్యక్షుడు దయాకర్ ముదిరాజ్, పలువురున్నారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-తొగుట



(ఫైల్)

బైక్ ఢీ కొని వ్యక్తి మృతి చెందిన సంఘటన తుక్కాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. శుక్రవారం తొగుట ఎస్ఐ రవి కాంత్ రావు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దొంతి యాదగిరి (34) గురువారం ఘనపూర్ గ్రామం నుంచి తుక్కాపూర్ గ్రామానికి నడుచుకుంటూ వస్తున్నాడు. మార్గమధ్యలో ఘనపూర్ శివారులోని కోళ్ల ఫారాల దగ్గరికి రాగానే వెనక నుంచి వస్తున్న బుల్లెట్ బండి నెంబర్ టిఎస్ 07 జీబీ 6655 నెంబర్ వాహనంతో శివంగి ప్రశాంత్ అతివేగంగా, ఆ జాగ్రత్తగా నడుపుతూ యాదగిరికి ఢీ కొట్టాడు. అతని తలకు, కాళ్లకు తీవ్ర రక్త గాయాలవగా చికిత్స నిమిత్తం సిద్ధిపేట ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఆసుపత్రిలో మృతి చెందాడు. మృతుని తల్లిదండ్రులు చిన్న తనంలోనే చనిపోవడంతో మృతుని మేనత్త చిక్కు డు లక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు.

మా పొలాల నుంచి హైవే రోడ్డు వద్దు..



- పలు గ్రామాల రైతుల ఆందోళన
- రీజినల్ అధికారి రాకపోవడంతో ఆగ్రహం
- ముందున్న రోడ్డునే వెడల్పు చేయాలని వినతి



నవతెలంగాణ-కొండపాక

సూర్యాపేట నుంచి సిరిసిల్లకు వెళ్లే 365 బి జాతీయ రహదారి పనులు తమ పంట పొలాల నుంచి వేయవద్దంటూ కొండపాక మండలం పలు గ్రామాల ప్రజలు రైతులు ఆందోళనకు దిగారు. ఈ రోడ్డు నిర్మాణ పనుల కోసం గత రెండు రోజుల నుంచి అధికారులు సర్వే పనులు చేపట్టారు. చేర్యాలను వైపు నుంచి ప్రారంభమైన రోడ్డు కొండపాక మండలం వెలికట్ట నుంచి టోల్గేట్ రాజీవ్ రహదారిని దాటుతూ మర్పడగ రోడ్డు కలుపుతూ నిర్మాణం కోసం రోడ్డుకిరువైపులా అధికారులు సర్వే చేసి హద్దులు గుర్తించారు. తమకు సమాచారం ఇవ్వకుండా తమ పట్టా భూములు పంట పొలాల్లో హద్దులు గుర్తించడం ఏమిటని ఈనెల 12న రైతులు సర్వేను అడ్డుకున్నారు. దాంతో సర్వే చేస్తున్న అధికారులుపై అధికారులకు సమాచారం ఇవ్వడంతో రైతులతో మాట్లాడేందుకు నేషనల్ హైవే రీజినల్ ఆఫీసర్ కృష్ణ ప్రసాద్, ఆర్ అండ్‌బీ ఎస్ఈఈ బలరామ కృష్ణ శుక్రవారం వస్తున్నారని రైతులంతా ఉండాలని సర్వే చేసిన అధికారులు డీఈ అన్నారెడ్డి, ఏఈ కరుణలు తెలిపారు. దాంతో రైతులంతా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి తమ సమస్యలు తెలపడానికి వచ్చారు. కానీ మధ్యాహ్నం 3.30 నిమిషాల వరకు అధికారులు రాలేదు తీరా డీఈ అన్నారెడ్డి మాత్రమే రావడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి ఆందోళనకు దిగారు. రేపటి నుంచి టెంట్ వేసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. తమ పంట భూములకు నష్టం చేయవద్దని డీఈ కి వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా మరి కొంతమంది రైతులు సిద్ధిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి జిల్లా కలెక్టర్ వినతిపత్రం అందజేశారు.

భారీగా పోలీసు బలగాలు

జాతీయ రహదారి సర్వే పనులు అడ్డుకోవడంతో రైతులంతా జాతీయ రహదారి రీజినల్ అధికారులతో మాట్లాడేందుకు సమయం కేటాయించడంతో కొండపాక మండలం జప్తి నాచారం వద్ద దుద్దెడ తొగుట రోడ్డు మధ్యలో సమావేశం అయ్యారు. జప్తి నాచారం, మర్పడగ, దుద్దెడ, ఖమ్మంపల్లి, బందారుపల్లి, తడకపల్లి తదితర గ్రామాలకు చెందిన రైతులంతా సమావేశం అయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే ఉన్నారు. ఈ విషయంలో ఎలాంటి సంఘటన జరగకుండా పోలీసులు భారీగా చేరుకున్నారు. గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి, తొగుట సిఐ లతీఫ్, సిద్ధిపేట త్రీ టౌన్ సిఐ విద్యాసాగర్, కుకు నూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ లతోపాటు పలువురు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. తీరా పై స్థాయి అధికారులు రాకపోవడంతో రైతులు వెళ్లిపోయారు.



భూ సేకరణ పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ మను చౌదరి



నవతెలంగాణ-సిద్దిపేటకలెక్టరేట్

శుక్రవారం సమీకృత జిల్లా కార్యలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా టీజీఐఐసీ, రెవెన్యూ, సర్వే అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో కేటాయించిన మండలాల్లో తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ వారికీ కేటాయించిన భూముల భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చెయ్యాలని సూచించారు. మండలాల వారీగా తహసీల్దార్, సర్వే అధికారులు కేటాయించిన ప్రభుత్వ, పట్టా, అసైన్డ్ భూములు ఎన్నో వెరిపై చెయ్యాలని సూచించారు. భూసేకరణ పూర్తి కాగానే భూమి చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించుకోవాలని టీజీఐఐసీ అధికారులకి తెలిపారు. కొన్ని భూముల వివరాలు పాత విధానంలో ఉన్నందున కొత్త భూసేకరణ వివరాల ప్రకారం పత్రలు తయారు చేసుకోవాలి. భూసేకరణను డ్రోన్ ద్వారా కొలతల తీసుకుంటే సులభంగా వేగంగా అవుతుందని తెలిపారు. ఈ మొత్తం ప్రాసెస్ ఆర్డీవోలు ఎల్లప్పుడూ పర్యవేక్షణ చెయ్యాలి. టీజీఐఐసీ, రెవెన్యూ, సర్వే అధికారుల సమన్వయముతో భూసేకరణ వేగంగా పూర్తి చెయ్యాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు సదానందం, చంద్రకళ, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ అనురాధ, డీజీఎం ఉమా మహేశ్వర్, డిఈ జ్యోతి, డిఎం మహేశ్వర్ మండల తహసీల్దార్లు పాల్గొన్నారు.

అధ్యాపకుల గొంతుకనవుతా..

- కరీంనగర్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్ కుమార్



నవతెలంగాణ-సిద్దిపేట

30 ఏండ్లుగా విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలపై ఉద్యమాలు చేశానని, తనను ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపిస్తే శాసనమండలిలో ఉపాధ్యాయుల, అధ్యాపకుల గొంతుక అవుతానని కరీంనగర్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేయించి ఓ పి ఎస్ పునరుద్ధరణ చేయిస్తామని, 317 జీఓ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని, కేజీబీవీ ఉపాధ్యాయులకు సమ్మె కాలపు వేతనం ఇప్పిస్తానని, వారికి కనీస వేతన అమలు చేయిస్తామని, పెండింగ్ లో ఉన్న నాలుగు వేల కోట్ల బకాయిలు, పదవి విరమణ పొందిన వారికి పెన్షనరీ బెనిఫిట్స్, మంచి ఫిట్మెంట్‌తో పి ఆర్సీ ఇప్పించడానికి కృషి చేస్తానని, గురుకుల పాఠశాల టైంటేబుల్ మార్పిడి చేయిస్తామని, ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ అమలు చేసి ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 57 ప్రకారం నెలవారీ ప్రమోషన్, అర్హత ఉన్న టీచర్లకు జేఎల్, ఎంఈఓ ఓ, డిప్యూటీ డిఇఓ , డైట్ లెక్చరర్ల ప్రమోషన్ ఇప్పిస్తామని, మోడల్ స్కూల్ టీచర్లకు 010 కింద వేతనాలు ఇప్పించడానికి కృషి చేస్తానని అన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ప్రభుత్వంతో నిరంతరం పోరాడుతానని తెలిపారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.అనిల్ కుమార్, టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జి తిరుపతిరెడ్డి, ఎస్సీ, ఎస్టీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కొంగల్ వెంకట్, తదితరులు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న అశోక్ కుమార్ ను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీల అమలుకై 20న ఛలో హైదరాబాద్

నవతెలంగాణ-సిద్దిపేట

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు కోసం ఈ నెల20న సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ధర్నా చౌక్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు పార్టీ నాయకులు కె.ఎస్.అనిల్, కొంపెల్లి విజయ్ కుమార్‌లు తెలిపారు. శుక్రవారం సిద్దిపేట అంబేద్కర్ సర్కిల్ గోడ ప్రతులను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ.. రేవంత్ రెడ్డి సర్కార్ ఆరు గ్యారెంటీల హామీలు ఇచ్చి వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి 14 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ అమలు చేయట్లేదని మండిపడ్డారు. రేవంత్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు, వాగ్దానాల అమలు చేయాలని ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి సిద్దిపేట జిల్లా నుంచి ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వి. శ్రీకాంత్, న్యూడెమోక్రసీ పార్టీ నేతలు కే.ప్రశాంత్ కుమార్, ఐఎఫ్టియు జిల్లా నాయకులు తడక లచ్చయ్య, పీ.డీ.ఎస్.యు జిల్లా ప్రధాన కార్యదర్శి గ్యార గణేష్, ఆనంద్, పీవైఎల్ నాయకులు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వైద్య శిబిరం

నవతెలంగాణ-దౌల్తాబాద్



విద్యార్థులకు మెరుగైన ఆరోగ్యం కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని డాక్టర్ ఇంద్రమోహన్ ప్రధానోపాధ్యాయులు మధు శ్రీవాత్సవ అన్నారు. శుక్రవారం దౌల్తాబాద్ మండల కేంద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల దౌల్తాబాద్‌లో జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దౌల్తాబాద్‌కి సంబంధించిన డాక్టర్ ఇంద్రా మోహన్ వైద్య బృందం, కళాశాలను సందర్శించి పిల్లల ఆరోగ్య స్థితిగతులను పరీక్షించి వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచనలు చేశారు. అలాగే వారికి తగు మందులను ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందన్నారు. విద్యార్థులు ప్లాస్టిక్ కవర్ లలో ప్యాకింగ్ తో వచ్చేటువంటి జంక్ ఫుడ్ కు దూరంగా ఉంటూ, బెల్లం రాగిజావ వంటి పౌష్టిక ఆహారాన్ని క్రమం తప్పకుండా తీసుకుంటూ ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది బాలమణి, అధ్యాపకులు రాజు, శ్రీనివాసరెడ్డి, శివకుమార్, మంగ్తా నాయక్, సుధాకర్, భాగ్యమ్మ, నాగేశ్వరరావు, పవన్ కుమార్, అమూల్య అధ్యాపకేతర బృందం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల కృషి

నవతెలంగాణ-దౌల్తాబాద్



పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న పూర్వ విద్యార్థుల కృషి అభినందనీయమని దొమ్మాట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాసిత్ అన్నారు. శుక్రవారం ఆ పాఠశాలలో 2002-03 బ్యాచ్ పూర్వ విద్యార్థులు సభా వేదికకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల కృషిని కొనియాడారు. మరొకరు పాఠశాల పూర్వ విద్యార్థి, బీఆర్ఎస్ యువజన నాయకులు నర్రా రాజేందర్ మాట్లాడుతూ.. తన వంతు సహాయంగా పాఠశాల ముఖద్వారం వద్ద పాఠశాల పేరుతో బోర్డు ఏర్పాటు చేయడానికి సహాయం చేస్తానని, పదవ తరగతిలో 10 జీపీఏ గ్రేడ్ సాధించిన విద్యార్థులకు రూ.5 వేల నగదు పురస్కారం అందజేస్తానని, తెలిపారు. సెల్ఫ్ డిఫెన్స్ కరాటేలో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థినిలకు, కరాటే మాస్టర్ నవీన్ కు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థుల బృందం 2002-03 బ్యాచ్ నాయకులు రాజు, ప్రభు, ఉపాధ్యాయ బృందం రాజేశ్వర్, మధురకవి, శ్రీధర్, కిషన్ రెడ్డి, సత్యనారాయణ, ప్రకాష్ ,రాజు, రమేష్ ,చందు, కళ్యాణీలు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

నవతెలంగాణ-చేర్యాల



ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఎంతో ఉపయోగపడుతుందని మాజీ ఎంపీపీ కరుణాకర్ అన్నారు. మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో పలువురికి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సహకారంతో మంజూరైన రూ.73 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శుక్రవారం బీఆర్ ఎస్ మండల అధ్యక్షులు అనంతుల మల్లేశం, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలు యాదవ్‌తో కలిసి మాజీ ఎంపీపీ బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ బీఆర్ఎస్ నాయకులు గర్నపల్లి చంద్రం, ఆరేపల్లి లక్ష్మయ్య, పెంబర్ల రాజశేఖర్, పోరెడ్డి నవీన్ కుమార్, మేడబోయిన కుమార్, కొక్కొండ రవికు మా ర్, పోలోజు రాజబాబు ,కొక్కొండ వినోద్ కుమార్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్య సేవల్లో నిర్లక్ష్యం చేయకూడదు

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.పాల్వాన్ కుమార్



నవతెలంగాణ-దౌల్తాబాద్

ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు అందించే వైద్య సేవలలో నిర్లక్ష్యం వహించరాదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. పాల్వాన్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఇందుప్రియాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య కేంద్రాలలో నిర్వహిస్తున్న ఆరోగ్య కార్యక్రమాల పనితీరును రికార్డుల ద్వారా తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రాలలోని ల్యాబ్‌లో నిర్వహిస్తున్న పరీక్ష నమూనాలను రికార్డులను, ఫార్మసీ గదిలో ఉన్న మందులను ఈ ఔషధ రికార్డులను పరిశీలించామన్నారు. ఆరోగ్య కేంద్రంలో అందుతున్న సేవలను రోగుల వద్దకు వెళ్లి అడిగి తెలుసుకున్నారు. రికార్డులను ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలన్నారు. ప్రజలకు ఎప్పుడు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ రేవతి, వైద్యాధికారులు డాక్టర్ నాగరాజు, డాక్టర్ కిరణ్ కుమార్, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పుల్వామా అమరులకు నివాళ్లు

నవతెలంగాణ-మర్కూక్

జమ్మూకశ్మీర్‌లోని పుల్వామాలో దాడిలో అమరులైన సైనికుల చిత్రటాలకు మండల కేంద్రమైన మర్కూక్‌లో శుక్రవారం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అఖిల పక్ష నాయకులు మాట్లాడుతూ.. ఈ రోజు చీకటి రోజని, దాడిలో వీర మరణం పొందిన 40 మంది అమర సైనికుల ఆశాయాల కోసం యువత ముందుకు సాగలన్నారు. పాకిస్తానీ ఉగ్రమూకల దాడిలో వీరమరణం పొందిన అమరజవానుల సేవలను దేశ ప్రజలు ఎన్నటికీ మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్షం నాయకులు బీజేపీ మాజీ మర్కూక్ మండలాధ్యక్షులు టి.రమేష్ గుప్తా, మర్కూక్ మాజీ సర్పంచ్ కర్రోల్ల నర్సింలు, బీఆర్ఎస్ నాయకులు సతీష్ గౌడ్, సాయిరెడ్డి, నాయకులు అంజిరెడ్డి, అంజనేయులు చారి, తదితరులున్నారు.




నవతెలంగాణ-సిద్ధిపేట : పుల్వామాలో జరిగిన దాడి భారతదేశం మర్చిపోలేనిదని బీఆర్ఎస్ మండలాధ్యక్షులు కాముని శ్రీనివాస్ అన్నారు. అమర జవాన్లకు శుక్రవారం చిన్నకోడూరు మండల బీఆర్ఎస్ పార్టీ పక్షాన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాణాలను పనంగా పెట్టి భారతదేశాన్ని కాపాడుతున్న సైనికులను ఉగ్రవాదులు మాటు కాచి బాంబులు వేయడం వల్ల పుల్వామాలో జవాన్లు వీరత్వం పొందారన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ బొడిగె సదానందం, జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, కొండం రవీందర్ రెడ్డి, ఇట్టబోయిన శ్రీనివాస్, గుజ్జ రాజు, భట్టు లింగం, కుంట వినయ్ రెడ్డి, గొల్లపల్లి రాజశేఖర్ రెడ్డి, బైండ్ల సుధాకర్, పంపరి కనకయ్య, సాదక్, తదితరులు పాల్గొన్నారు.



ప్రజల పక్షాన ప్రభుత్వంపై పోరాడుతా

- ధర్మ సమాజ్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి మంద జ్యోతి



నవతెలంగాణ-సిద్దిపేట

ఎమ్మెల్సీగా గెలిపిస్తే శాసనమండలిలో ప్రజల పక్షాన ప్రభుత్వంపై పోరాడుతానని ధర్మ సమాజ్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి మంద జ్యోతి అన్నారు. శుక్రవారం డీఎస్పీ జిల్లా అధ్యక్షులు సదన్ మహరాజ్‌తో కలిసి స్థానిక ప్రెస్ క్లబ్‌లో మీడియాతో ఆమె మాట్లాడుతూ..ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ధర్మసమాజ్ పార్టీ తరపున పోటీ చేసే అవకాశం కల్పించినందుకు రాష్ట్ర కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న పోటీ కోటీశ్వరుల కి సామాన్యురాలికైన తనకి జరుగుతున్న ఎన్నిక కాబట్టి వేల కోట్ల అధిపతులని మట్టిగరిపించి నన్ను శాసనమండలికి ఎంపిక చేస్తే, పట్టభద్రుల, నిరుద్యోగ సమస్య, విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు అనే అంశాల మీద శాసనమండలిలో ప్రజల పక్షాన పోరాడుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి రవిబాబు, జిల్లా నాయకులు బుగ్గ రాజు, ప్రసన్న, ఎల్లన్న, తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్‌ను ఎత్తివేయాలని ట్రాక్టర్లతో నిరసన



నవతెలంగాణ - గుమ్మడిదల

రైతుల మనోభావాలను గౌరవించి వెంటనే డంపింగ్ యార్డ్‌ను ఎత్తివేయాలని గుమ్మడిదలలో విద్యార్థులు మహిళ రైతులతో కలిసి జేఏసీ నాయకులు శుక్రవారం ట్రాక్టర్లతో నిరసన తెలిపారు నల్లవల్లి పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డు వల్ల వ్యవసాయ రంగంతో పాటు వాయు కాలుష్యం నీటి కాలుష్యంతో పాటు హైదరాబాద్ పరిసర ప్రాంతంలో ఉన్న ఎయిర్ ఫోర్స్ అకాడమీతో పాటు ప్రధాన రహదారిపై వాహనాల రద్దీ వల్ల ప్రమాదాలు చోటు చేసుకునే ప్రమాదం పొంచి ఉందని జేఏసీ నాయకులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మరొకసారి సమాలోచన చేసి వెంటనే డంపింగ్ యార్డ్ ఎత్తివేసే దిశగా చర్యలు చేపట్టాలని అన్నారు సామాన్య ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న వారి జీవితాలు ప్రశ్నార్థకంగా మారుతాయని పచ్చని పల్లె వాతావరణంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటయితే గుమ్మడిదల మండలంతో పాటు నర్సాపూర్ నియోజకవర్గ చెరువులు కుంటలతో పాటు వ్యవసాయ పంట పొలాలు కలుషితమై సామాన్య ప్రజల ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గమనించి ప్రాంత రైతులు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెలో వివిధ రూపాల్లో నిర్వహిస్తూ ఉన్నప్పటికీ ప్రభుత్వ అధికారులు స్పందించకపోవడంలో ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నత అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి డంపింగ్ యార్డ్ రద్దు అయ్యే దిశగా నివేదికలు పంపాలని మండల జైంట్యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ తో పాటు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని పాముల పర్తి గ్రామానికి చెందిన చిన్నబోయిని లక్ష్మణ్ (42) గురువారం మృతి చెందాడు. శుక్రవారం బీఆర్ఎస్ బీసీ సెల్ మర్కుక్ మండలా ధ్యక్షులు మ్యాకల కనకయ్య ముదిరాజ్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి , ఆర్థిక సాయం అందజేశారు. ఆయనతో పాటు బోయిని స్వామి , కొట్టాల మహేష్ , తదితరులున్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన చెప్యాల పద్మ ఫిబ్రవరి 8న అనారోగ్యంతో మృతి చెందింది .విషయం తెలుసుకున్న చల్లారం సుధాకర్ రెడ్డి వారి అమ్మ చల్లారం బాలమ్మ జ్ఞాపకార్థం 5వేలు ఆర్థిక సాయం, చల్లారం రాజశేఖర్ రెడ్డి రూ.1000లు, చల్లారం మహేందర్ రెడ్డి రూ.1000లు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్యాల నర్సింహులు గ్రామస్తులు, శ్రీనివాస్ రెడ్డి, ప్రశాంత్, కాలనీ వాసులు, లింగం,బాను,రాజు,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రామకోటి సంస్థకు గోటి తలంబ్రాలు ఓడ్లు అందజేత

-భద్రాచల దేవస్థానం ఏఈవో శ్రావణ్ కుమార్

నవతెలంగాణ-గజ్వేల్

భద్రాచలంలో శ్రీరామనవమిన సీతారాముల కళ్యాణంలో గోటితో ఒలిచిన తలంబ్రాలు వాడడం ఆనవాయితీ. 250కిలోల గోటి తలంబ్రాలకు



(ఓడ్లకు) శుక్రవారం నాడు ప్రత్యేక పూజలు జరిపి రామకోటి రామరాజును దేవస్థానంలో ఘనంగా సన్మానించి ఓడ్లను అందజేశామని భద్రాచల దేవస్థానం ఏఈవో శ్రావణ్ కుమార్ తెలిపారు.

పాఠశాలల్లో స్వయం పరిపాలన దినోత్సవం



నవతెలంగాణ-కొండపాక

కుకునూరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. 10వ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా ప్రధానోపాధ్యాయులు మండల విద్యాధికారి డీఈఓ ఆర్‌జేడీలా వ్యవహరించారు. పాఠశాలకు ఉదయం 8:30కి వచ్చి విద్యార్థులకు పాఠాలు బోధించి వారి ప్రత్యేకతను చాటుకున్నారు. పాఠశాల ప్రధానో పాధ్యాయులుగా శ్రవణ్ కుమార్ ఎంఈఓగా స్పందన డీఈఓగా మహినుద్దీన్ ఆర్జెడిగా సాయి చరణ్, 10వ తరగతి విద్యార్థినీ విద్యార్థులు వివిధ ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. పాఠశాలలోని అన్ని తరగతుల విద్యార్థులకు ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 1:00 వరకు పాఠాలు బోధించి ఉపాధ్యాయులుగా వ్యవహరించారని మండల విద్యాధికారి , పాఠశాల ప్రధానోపాధ్యాయులు బచ్చలి సత్తయ్య తెలియజేశారు. మధ్యాహ్నం నిర్వహించిన సమావేశంలో ఉపాధ్యా యులైన విద్యార్థులు పాల్గొని ఉపాధ్యాయుల బోధించే విధానము ఎంత కష్టతరంగా ఉంటుందో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరు లు పాల్గొన్నారు.

నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ మండలంలోని సింగాటం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అహ్మదిపూర్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు సుగుణాకర్ స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ రెడ్డి పాల్గొని మాట్లాడు తూ.. సమ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుం దన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు విద్యా బోధన చేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో డీఈఓగా ఇమ్రాన్, ఎంఈఓగా అమరేశ్వర్ గౌడ్ ప్రధానోపాధ్యాయులు నిత్య ఉపాధ్యాయులుగా ఉమా, మనిషా శృతి, హర్షవర్ధన్, రామస్వామి, మహేందర్ వ్యవహరించారు. తదనం తరం ఈ పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యా యులు శ్రీరామ్ శ్రీనివాస్, సంతోష్ రెడ్డి లకు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాఠశాల ఉపాధ్యాయులు శాల్వతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం బద్దిపడగ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఐదో తరగతి విద్యార్థులు ఉపాధ్యా యులుగా మారి తమ తోటి విద్యార్థులకు చక్కగా పాఠాలు బోధించారు. డీఈవోగా సిద్ధాంత్, ఎంఈఓగా ఈశ్వంత్, హెచ్ఎంగా శ్రీనిత, ఉపాధ్యాయులుగా గౌతమ్, రమ్య, హాసిని, రామ్ చరణ్, వరుణ్, తేజ, రిత్విక్, లక్ష్మణ్, అభిలాష్, శ్రీక్షిత్, శ్రీమాన్, అనురూప్ వ్యవహరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, చంద్రకాంత్, మంగ, రవళి పర్యవేక్షించారు. బోధనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.





ఎమ్మెల్యేల ఫిరాయింపుపై బీఆర్ఎస్ ముసలి కన్నీరు

నవతెలంగాణ-గజ్వేల్

ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయింపులపై కేసీఆర్, కేటీఆర్ మొసలి కన్నీరు కారుస్తున్నారని టీడీపీ ఎమ్మెల్యే తలసానిని మంత్రిగా చేసినప్పుడు కేసీఆర్‌ను కేటీఆర్ ఎందుకు నిలదీయలేదని కాంగ్రెస్ పార్టీ 15వ వార్డ్ ఇంచార్జ్ జంగం రమేష్ గౌడ్, మండల నాయకులు శ్రీనివాస్ రెడ్డిలు ఘాటుగా విమర్శించారు. శుక్రవారం విలేకరులతో వారు మాట్లాడుతూ.. గతంలో టీడీపీ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకున్నప్పుడు కేటీఆ ర్‌కు వాస్తవాలు గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. 2019లో 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకున్నప్పుడు ప్రజాస్వామ్యం ఎటుపోయిందో కేసీఆర్, కేటీఆర్‌లు చెప్పా లన్నారు. పార్టీ ఫిరాయింపులపై నేడు వేదాలు వల్లిస్తుండటం హాస్యాస్పదమ న్నారు. ఆనాడు కేసీఆర్ టీడీపీ ఎమ్మెల్యేలను తన పార్టీలో చేర్చుకొని రాజకీయాల్లో దుర్మార్గమైన పద్ధతులకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. మనకు ఒక న్యాయం మందికి మరో న్యాయం ఉండకూడదు అని అందరికీ ఒకే న్యాయం ఉండాలని స్పష్టం చేశారు.

